


# విభారె
తెలుగు దినపత్రిక
VIBHARE TELUGU DAILY








PUBLISHED FROM KURNOOL ఎడిటర్: ఆవుల విజయ భాస్కర రెడ్డి బుధవారం 18 ఆగస్టు 2021 సంపుటి : 03 సంచిక :14 పేజీలు : 4 వెల : రూ 3-00


# స్కూళ్లలో కోవిడ్ ప్రోటోకాల్స్ అమలు



తాడేపల్లి: స్కూళ్లల్లో కోవిడ్ ప్రోటోకాల్స్ పాటించేలా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ఎవరికైనా కరోనా లక్షణాలు కనిపిస్తే వెంటనే పరీక్షలు చేయాలని సూచించారు. సీఎం వైఎస్ జగన్ మంగళవారం కోవిడ్ నివారణ చర్యలపై తాడేపల్లి క్యాంప్ కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. వ్యాక్సినేషన్‌లో గ్రామ, వార్డు సచివాలయాన్ని యూనిట్‌గా తీసుకోవాలని తెలిపారు. ప్రాధాన్యతా క్రమంలో వ్యాక్సిన్ వేసుకుంటూ వెళ్లాలని సూచించారు. ఉదయం 6 నుంచి రాత్రి 11 గంటల వరకు కర్ఫ్యూ సడలింపులు ఉంటాయని పేర్కొన్నారు. పెళ్లిళ్లకు ముందస్తు అనుమతి తీసుకోవాలని,150 మందికే అనుమతి ఉంటుందని చెప్పారు. కోవిడ్ ప్రోటోకాల్స్ పాటించేలా అధికారులు స్వయంగా

**కరోనా లక్షణాలు కనిపిస్తే వెంటనే పరీక్షలు**
**గ్రామ,వార్డు సచివాలయం యూనిట్‌గా వ్యాక్సినేషన్**
**అధికారులతో సమీక్షలో సీఎం జగన్ ఆదేశాలు**

పర్యవేక్షించాలని సీఎం జగన్ ఆదేశించారు. ప్రభుత్వాస్పత్రుల్లో 90 రోజుల్లోగా రిక్రూట్‌మెంట్ పూర్తి చేయాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. ప్రజలకు వైద్య సేవలందించడంలో ఇబ్బందులు రాకూడదని ఆయన స్పష్టంచేశారు. ఆస్పత్రుల్లో "నాడు-నేడు" పనులు వేగంగా జరిగేలా చూడాలని ముఖ్యమంత్రి అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సీఎం ఆళ్లనాని, కోవిడ్ టాస్క్‌ఫోర్స్ అధికారులు హాజరయ్యారు.



# సీఎం జగన్‌కి కృతజ్ఞతలు తెలిపిన ఎంపీడీవోలు

తాడేపల్లి: దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న తమ ప్రమోషన్ సమస్యను తీర్చినందకు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు ఎంపీడీవోలు. ఈ క్రమంలో మంగళవారం ఎంపీడీవోలు తాడేపల్లి క్యాంప్ కార్యాలయంలో సీఎం జగన్‌ని కలిశారు. తమ ప్రమోషన్స్ వల్ల కింది స్థాయిలోని 13 కాడెర్స్ వారికి ప్రమోషన్స్ వస్తున్నాయని ఏపీ గవర్నమెంట్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ చైర్మన్ వెంకట్రామిరెడ్డి తెలిపారు. ఎంపీడీవోలకు ప్రమోషన్లు లేక ఇబ్బంది పడ్డారని తెలిపారు. సీఎంగా వైఎస్ జగన్ వచ్చాక తమకు న్యాయం జరిగిందన్నారు. మరో పదిరోజుల్లో తమ ప్రమోషన్స్ ఉత్తర్వులు రానున్నాయి. ఈ క్రమంలో ఈ ఏడాది నవంబర్లో లక్ష మంది పంచాయతీరాజ్ ఉద్యోగులతో కృతజ్ఞత సభ పెడతాం అన్నారు.



ప్రభుత్వం ఆర్థిక పరిస్థితి మెరుగైన తర్వాత ఉద్యోగులకు పీఆర్సీ వంటివి అన్ని అమలు చేస్తారన్నారు. "మాలో కొంత మంది రిటైర్ కూడా అయ్యారు. నమ్మకం పోతున్న సమయంలో సీఎం జగన్ మాకు న్యాయం చేశారని" ఎంపీడీవో అసోసియేషన్ ప్రెసిడెంట్ వై.బ్రహ్మయ్య తెలిపారు. గతంలో వైఎస్సార్ దీనికోసం కృషి చేశారు... ఆయన కుమారుడు ఇప్పుడు అమలు చేశారన్నారు. సీఎం జగన్ నిర్ణయం వల్ల ఒకే సారి 300 మందికి ప్రమోషన్స్ వస్తున్నాయన్నారు. ఈ క్రమంలో తాము కూడా ఇంకా ఎక్కువ బాధ్యత తీసుకుని పనిచేస్తామన్నారు. సీఎం జగన్‌కి కృతజ్ఞతలు తెలిపారు.

## దేశంలో 25వేలకు తగ్గిన కరోనా కేసులు

న్యూఢిల్లీ : దేశంలో కరోనా కేసులు భారీగా తగ్గాయి. గడిచిన 24 గంటల్లో దేశంలో కొత్తగా 25,166 కేసులు నమోదయ్యాయని కేంద్ర కుటుంబ, ఆరోగ్యమంత్రిత్వ శాఖ తెలిపింది. 154 రోజుల తర్వాత అతి తక్కువగా కేసులు రికార్డయ్యాయని పేర్కొంది. తాజాగా 36,830 మంది బాధితులు కోలుకొని డిశ్చార్జి అయ్యారు. 24 గంటల్లో మరో 437 మంది మహమ్మారి బారినపడి మృత్యువాతపడ్డారు. తాజాగా నమోదైన కేసులతో దేశంలో మొత్తం పాజిటివ్ కేసుల సంఖ్య 3,22,50,679కు పెరిగింది. ఇందులో 3,14,48,754 మంది బాధితులు కోలుకున్నారు. వైరస్ బారినపడి మొత్తం 4,32,079 మంది ప్రాణాలు వదిలారు.ప్రస్తుతం దేశంలో 3,69,846కి తగ్గి.. 146 రోజుల కష్టానికి చేరుకున్నాయని చెప్పింది. దేశంలో రికవరీ 97.51 శాతానికి పెరిగిందని మంత్రిత్వ శాఖ పేర్కొంది. ప్రస్తుతం వీక్లీ పాజిటివిటీ రేటు 1.98శాతం, రోజువారీ పాజిటివిటీ రేటు 1.61శాతంగా ఉందని తెలిపింది. గత 24గంటల్లో 88.13లక్షలకుపైగా టీకా డోసులు పంపిణీ చేసినట్లు ఆరోగ్యమంత్రిత్వ శాఖ పేర్కొంది. ఒకే రోజు ఇదేస్థాయిలో టీకాలు వేయడం తొలిసారని చెప్పింది. దేశవ్యాప్తంగా ఇప్పటి వరకు 55.47పైగా డోసులు పంపిణీ చేసినట్లు వివరించింది. అలాగే మహమ్మారి మొదలైన నాటి నుంచి ఇప్పటి వరకు 49.66 కోట్ల కొవిడ్ శాంపిల్స్ పరీక్షించినట్లు తెలిపింది.



## ఏపీలో కర్ఫ్యూ సడలింపు

అమరావతి: ఏపీలో కర్ఫ్యూని సడలించారు. ఉదయం 6 గంటల నుంచి రాత్రి 11 గంటల వరకూ కర్ఫ్యూ సడలింపులు ఉంటాయని సీఎం జగన్ స్పష్టం చేశారు. మంగళవారం సీఎం క్యాంపు కార్యాలయంలో కోవిడ్ పరిస్థితులపై సమీక్షా సమావేశం నిర్వహించారు. పాఠశాలల్లో కోవిడ్ ప్రోటోకాల్స్ సమర్థవంతంగా పాటించాలని సీఎం జగన్ అధికారులను ఆదేశించారు. పాఠశాలల్లో వైద్య ఆరోగ్య శాఖ మార్గదర్శకాలను పాటించేలా అధికారులు దృష్టిపెట్టాలన్నారు. మాస్కులు ధరించేలా, భౌతిక దూరం పాటించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. స్కూళ్లలో కోవిడ్ పరీక్షలు చేయాలని ఆదేశించారు. థర్డ్‌వేవ్ నేపథ్యంలో ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రాధాన్యతా క్రమంలో ప్రతి ఒక్కరికీ వ్యాక్సిన్ ఇచ్చేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు.అలాగే తెల్లవారు జామున జరిగే పెళ్లిళ్లకు ముందస్తుగా అనుమతి తీసుకోవాలన్నారు. పెళ్లిళ్లలో 150 మందికే అనుమతి ఉంటుందని చెప్పారు.వివాహ కార్యక్రమాల్లో కోవిడ్ ప్రోటోకాల్స్ పాటించేలా అధికారులు స్వయంగా పర్యవేక్షించాలన్నారు. కోవిడ్ రూల్స్ ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సీఎం జగన్ అధికారులను ఆదేశించారు. నిర్దేశించిన విధంగా ప్రభుత్వ ఆస్పత్రుల్లో 90 రోజుల్లోగా రిక్రూట్‌మెంట్ పూర్తిచేయాలన్నారు. ఆ తర్వాత ప్రభుత్వ ఆస్పత్రుల్లో సిబ్బంది లేరన్న మాట వినిపించకూడదని చెప్పారు. ప్రజలకు వైద్య సేవలు అందడంలో ఎలాంటి ఇబ్బందులు రాకూడదన్నారు. ఆస్పత్రుల్లో నాడు ? నేడు పనులను కూడా వేగంగా ముందుకు తీసుకెళ్లాలని ఆదేశించారు. సమర్థవంతమైన ఔషధ నియంత్రణ, పరిపాలనకోసం రెండు కొత్త వెబ్‌సైట్లు డిజైన్ చేసినట్లు సమావేశంలో సీఎం జగన్ తెలిపారు.

# చావు పరామర్శకు వెళ్ళి.. యుద్ధంలో గెలిచినట్టు లోకేష్ చేష్టలేంటి..!?



**పెళ్ళికీ, చావుకీ ఒకే మంత్రం వేస్తే ఏమవ్వుతుందో తెలుసుకో లోకేష్**
**- మంత్రి అవంతి**

విశాఖపట్నం: గుంటూరులో బీటెక్ విద్యార్థిని రమ్య దారుణ హత్య రాష్ట్రంలో ప్రతి ఒక్కరినీ తీవ్రగ్భ్రాంతికి గురి చేసిందమంత్రి అవంతి శ్రీనివాస్ అన్నారు. . ప్రభుత్వం, వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ తరఫున వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి, సంతాపాన్ని తెలియజేస్తున్నాం. హోం మంత్రి సుచరిత నిన్ననే బాధితురాలి కుటుంబాన్ని పరామర్శించి, వారికి సాయాన్ని అందించి, ప్రభుత్వం తరఫున అన్నివిధాలుగా అండగా నిలుస్తామని భరోసా ఇచ్చారు. ఎంతో భవిష్యత్తు ఉన్న విద్యార్థినిని ఈ విధంగా హత్య చేయడం చాలా బాధాకరం. సోషల్ మీడియా ద్వారాగానీ, ప్రత్యక్షంగా కానీ మహిళలు, యువతులపై ఎవరైనా బెదిరింపులకు పాల్పడితే.. పోలీసులకు ఫిర్యాదు చేయండి. లేకపోతే దిశ యాప్ ద్వారా కంప్లైంట్ చేయండి. దిశ యాప్ ను ప్రతి ఒక్క మహిళ, యువతి డౌన్ లోడ్ చేసుకోవాలి. మహిళలపై అఘాయిత్యాలకు పాల్పడితే.. ఈ ప్రభుత్వం ఏ కులమైనా, మతమైనా, ఎవర్నీ ఉపేక్షించదు. పక్క రాష్ట్రంలో ఓ మెడికోపై అఘాయిత్యం జరిగితే.. ముఖ్యమంత్రి జగన్ గారు స్పందించి, అసెంబ్లీలో దిశ బిల్లు చేసి, చట్టం కోసం కేంద్రానికి పంపించాం. అది చట్టమైతే ఇటువంటి ప్రేమోన్మాదులకు, అల్లరిమూకలకు మరింత వేగంగా శిక్షలు పడతాయి. రమ్య హత్య కేసులో.. ఆంధ్రప్రదేశ్ పోలీసులు కూడా 24 గంటల్లోనే నిందితుడ్ని అరెస్టు చేశారని అన్నారు.. పనిలేని ప్రతిపక్షంగా తెలుగుదేశం పార్టీ ఈ రాష్ట్రంలో ఉంది. చంద్రబాబు కుమారుడుగా తప్పితే.. ఏ అర్హతా లేని లోకేష్ ఈ మధ్య వెయిట్ తో పాటు విచక్షణ కూడా కోల్పోయి ముఖ్యమంత్రిగారిని నోటికొచ్చినట్లు మాట్లాడుతున్నాడు. రమ్యను కోల్పోయి వారి కుటుంబం బాధలో ఉంటే.. ఓదార్చాల్సిందిపోయి, గుంటూరు ప్రభుత్వాసుపత్రి నుంచి మృతదేహాన్ని తీసుకువెళ్ళకుండా అడ్డుకోవడం, పోలీసులపై టీడీపీ నేతలు దౌర్జన్యం చేయడం బాధాకరం. ముఖ్యమంత్రి జగన్ గారిని వ్యక్తిగతంగా దూషించినంత మాత్రాన జీరోగా ఉన్న లోకేష్ ఎప్పటికీ హీరో కాలేడు అన్నది గుర్తుంచుకోవాలని అన్నారు. ప్రజల మన్ననలు, సంపూర్ణ విశ్వాసంతో ఈ రాష్ట్రానికి జగన్ మోహన్ రెడ్డిగారు ముఖ్యమంత్రి అయ్యారు. అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా గత రెండేళ్ళలో జరిగిన అన్ని ఎన్నికల్లోనూ అప్రతిహాతంగా విజయ దుంధుభి మోగించారు. నాయకుడు అంటే జగన్ గారిలా ఆదర్శంగా ఉండాలి తప్పితే.. చిల్లర రాజకీయాలు చేయకూడదు. లోకేష్ గ్రామ స్థాయి నాయకుడి కంటే హీనంగా మాట్లాడుతున్నాడు. అమెరికాలో చదివిన లోకేష్.. ఇటువంటి భాషను మాట్లాడటం ఎంతవరకు సబబో తనకు తానే ఆత్మ విమర్శ చేసుకోవాలి. ముఖ్యమంత్రిగారిని ప్రస్తావిస్తూ.. వ్యక్తిగతంగా దూషణలు చేయడం లోకేష్ మానుకోవాలి. లోకేష్ వచ్చిన తర్వాతే.. రాజకీయాల్లో ఇటువంటి బూతుల ట్రెండ్ ను కొత్త ట్రెండ్ గా తెచ్చాడు. యుద్ధంలో జయించిన హీరో మాదిరిగా నిన్న రమ్య కుటుంబ సభ్యుల పరామర్శకు వెళ్ళిన లోకేష్.. నుదుటున పెద్ద బొట్టుపెట్టుకుని, కారు దగ్గర పిడికిలి బిగించి చూపిస్తూ సంకేతాలు ఇస్తూ, పోలీసులపై దౌర్జన్యం చేస్తూ, నోటికొచ్చినట్లు మాట్లాడటం ఏంటి...?. పెళ్ళికి, చావుకీ ఒకే మంత్రం అన్నట్టుగా లోకేష్ చేష్టలు ఉన్నాయని అన్నారు.

## కొనసాగుతున్న అల్పపీడనం: ఏపీలో భారీ వర్షాలు

విశాఖపట్నం: పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో అల్పపీడనం కొనసాగుతోంది. దీనికి అనుబంధంగా ఉపరితల ఆవర్తనం కొనసాగుతుంది. సముద్రమట్టనికి 7.6 కి.మీ ఎత్తులో కొనసాగుతోంది. అల్పపీడనం ప్రభావంతో ఉత్తర కోస్తా, దక్షిణ కోస్తా, రాయలసీమలో వర్షాలు కురిసే అవకాశం అవకాశముందని వాతావరణ కేంద్రం తెలిపింది. విజయనగరం, శ్రీకాకుళం, విశాఖ, తూర్పుగోదావరి, కర్నూలు జిల్లాల్లో కొన్ని చోట్ల భారీ వర్షాలు కురిసే అవకాశముందని విశాఖ వాతావరణ కేంద్రం వెల్లడించింది.



## అఫ్ఘన్ నుంచి బలగాల ఉపసంహరణను సమర్థించుకున్న బైడెన్



వాషింగ్టన్ : అఫ్ఘనిస్థాన్‌ను తాలిబన్లు హస్తగతం చేసుకున్న నేపథ్యంలో, బలగాల ఉపసంహరణపై అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ కీలక వ్యాఖ్యలు చేశారు. అఫ్ఘన్ నుంచి బలగాల ఉపసంహరణను సమర్థించుకున్నారు. ఆ నిర్ణయానికి తాను కట్టుబడి ఉన్నానని స్పష్టం చేశారు. 20 సంవత్సరాల తర్వాత బలగాలను వెనక్కి పిలిచేందుకు ఇదే సరైన సమయమని భావించినట్లు పేర్కొన్నారు. గతంలో చేసిన తప్పులను పునరావృతం చేయకూడదని నిర్ణయం తీసుకున్నామని, అయితే ఊహించినదానికంటే వేగంగా అఫ్ఘనిస్తాన్ వేగంగా తాలిబాన్ల వశమైందన్నారు. అయితే, తనకు ఎలాంటి విచారం లేదని ఆయన పునరుద్ఘాటించారు. సోమవారం వైట్‌హౌస్ నుంచి చేసిన టెలివిజన్ ప్రసంగంలో బైడెన్ ఈ వ్యాఖ్యలు చేశారు.అఫ్ఘన్‌ను తాలిబాన్లు ఆక్రమించిన నేపథ్యంలో అమెరికా వైఫల్యంపై విమర్శలు వెల్లువెత్తుతున్న నేపథ్యంలో వాటిని జోబైడెన్ తోసిపుచ్చారు. 9/11 ఘటన ఆర్వాత అల్ ఖైదాతో సంబంధాల కోసం తాలిబన్లను శిక్షించే దాని ప్రారంభ లక్ష్యాలకు మించి విస్తరించిన యుద్ధాన్ని ఆపడమే ప్రాధాన్యం అన్నారు. అఫ్ఘనిస్తాన్‌లో కేంద్రీకృత ప్రజాస్వామ్యం నిర్మించడం తమ లక్ష్యం కాదన్నారు. అమెరికాపై ఉగ్రదాడులను నిరోధించడమే తమ లక్ష్యమని స్పష్టం చేశారు. శాశ్వత సైనిక ఉనికి లేని దేశాల్లో ఉగ్రవాదంపై పోరాటాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. అమెరికా దళాలు నిష్క్రమించినప్పటికీ ఉగ్రవాద వ్యతిరేక కార్యకలాపాలు కొనసాగుతాయన్నారు. తాలిబాన్లు మళ్లీ దాడులను ప్రారంభిస్తే 'వినాశకరమైన' సైనిక ప్రతిస్పందన ఉంటుందని హెచ్చరించారు. అఫ్ఘాన్?లోని ప్రస్తుత పరిణామాలు.. విచారకరంగా ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అఫ్ఘన్ ప్రజలకు అమెరికా మద్దతు కొనసాగుతుందని అమెరికా అధ్యక్షుడు చెప్పారు. ప్రాంతీయ దౌత్యం కోసం అఫ్ఘన్ హక్కుల కోసం పాటుపడుతుందన్నారు.

## పథకాలు పక్కదోవ పట్టించడానికే లోకేష్ హైడ్రామా

**ఎమ్మెల్యేగా గెలవలేని లోకేష్ సీఎంకు సవాల్ విసరడమేంటి?**
**మంత్రి కొడాలి నాని**

అమరావతి: విద్యారంగంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనేక సంస్కరణలు చేపట్టారని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి కొడాలి నాని అన్నారు. మంగళవారం ఆయన తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో మీడియా సమావేశంలో మాట్లాడుతూ, ఓట్లు లేకపోయినా విద్యార్థులకు అనేక పథకాలు అమలు చేస్తున్నారన్నారు. పథకాలను పక్కదోవ పట్టించడానికే బాబు.. లోకేష్‌ను పంపి హైడ్రామా చేయించాడని మండిపడ్డారు. దళిత మహిళ చనిపోతే లోకేష్ శవ రాజకీయాలు చేశాడని దుయ్యబట్టారు. ప్రతిపక్షనేతగా ఉన్న చంద్రబాబు ఎందుకు పరామర్శించలేదో ప్రశ్నించాలన్నారు. ఎమ్మెల్యేగా గెలవలేని లోకేష్ సీఎంకు సవాల్ విసరడమేంటని కొడాలి నాని ఎద్దేవా చేశారు. ఘటన జరిగిన 12 గంటల్లో నిందితుడిని పట్టుకున్నారని.. దిశా చట్టం తెచ్చి మహిళలకు రక్షణ కల్పిస్తున్నారన్నారు.



# సంపాదకీయం

బుధవారం 18 ఆగస్టు 2021

## అధికారుల వ్యవహారంతో తలనొప్పి

తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులకు ఇప్పుడిప్పుడే తెలిసి వస్తున్నట్టుంది. కొంతలో కొంత తెలంగాణ నయం. ఆంధ్రాలో అయితే అసలు ఉద్యోగస్థులు సచివాలయానికి వస్తారో,లేదో తెలియని స్థితి. నిన్నామొన్నటివరకూ కోవిడ్ వంక, అంతకుముందు మూడు రాజధానుల గొడవ. ఇంకా వెనుకకు వెళితే హైదరాబాద్ నుంచి తరలింపు. ఇలా రకరకాల కారణాలతో ఉద్యోగులైతే కార్యాలయాలకు చాలా కాలంగా దుమ్మా కొడుతున్నారు. నవ్యాంధ్ర ప్రదేశ్ కు సంబంధించి ప్రభుత్వోద్యోగులు పాలనను గాలికి వదిలేశారన్న విషయం ముఖ్యమంత్రి ఆవేదనతోనే తేటతెల్లమైంది. వారానికి అయిదే రోజులు పని. అందులోనూ సోమవారం మధ్యాహ్నం వరకూ సెక్రటేరియట్ లో ఉద్యోగులు కనిపించరు. శుక్రవారం మధ్యాహ్నం నుంచే మూటాముల్లె సర్దుకుని వెళ్లిపోతుంటారు. ఈ మధ్య కాలంలో అది కూడా సక్రమంగా జరగడం లేదు. ఎవరు ఎప్పుడు వస్తారో చెప్పలేకపోతున్నారు. ఈ సమస్య చాలా కాలం నుంచే ఉంది. ఇటీవలి కాలంలో మంత్రులు, ఎమ్మెల్యేలకు సైతం అధికారులు, ఉద్యోగులు అందుబాటులో లేకపోవడంతో ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి దృష్టికి వచ్చింది. దీనిపై ఆయన స్పందించారు. ప్రధాన కార్యదర్శిని కూడా స్పందింప చేశారు. కానీ దీంతోనే సమస్య తీరిపోతుందా? అంటే ఎవరూ చెప్పలేకపోతున్నారు.రాష్ట్రాల విభజన తర్వాత అత్యధికంగా ప్రయోజనాలు పొందింది ఉద్యోగ వర్గాలే. పోటీలు పడి మరీ రెండు రాష్ట్రాలు ఉద్యోగులకు ఫిట్ మెంటులు అందచేశాయి. వేతనాలు బారీగా పెరిగాయి. పదవీ విరమణ వయసును 58 నుంచి 61 వరకూ పెంచారు. మరోవైపు పదోన్నతులకు అవకాశం వచ్చింది. ఇన్నిరకాలుగా ప్రయోజనం పొందినప్పటికీ అలసత్వం నెలకొంటూనే ఉంది. ఆంధ్రప్రదేశ్ తన రాజధానిని అమరావతికి మార్చుకుంది. ఇందుకు గాను ఉద్యోగ వర్గాలను బతిమలాడుకోవాల్సిన పరిస్థితి వచ్చింది. హైదరాబాద్ లో సుదీర్ఘకాలంగా సెటిల్ అయిన ఉద్యోగులు అమరావతి వెళ్లడానికి ఇష్టపడలేదు. అయిదురోజుల పనిదినాలను ప్రవేశపెట్టారు. అనేక రకాల రాయితీలు, సదుపాయాలు, వసతులు కల్పించారు. తప్పని సరి పరిస్థితుల్లోనే ఉద్యోగులు కదిలారు. . అయినా కుటుంబ నివాసాలను చాలామంది హైదరాబాద్ లోనే ఉంచేసుకున్నారు. కేవలం ఉద్యోగం నిమిత్తం వెళ్లివచ్చేసేలా షటిల్ సర్వీసులను ఏర్పాటు చేసుకున్నారు . ప్రభుత్వానికి ఈ తతంగం అంతా తెలిసినప్పటికీ ఏం చేయలేని నిస్సహాయ స్థితిలో పడిపోయింది. గడచిన అయిదు సంవత్సరాలుగా ఇదే తంతు.ముఖ్యమంత్రి జగన్ ఉద్యోగులు, అదికారుల తీరుపై వస్తున్న ఫిర్యాదులను పరిశీలించి ఆగ్రహం వ్యక్తం చేశారు. కానీ ఉద్యోగులు ఇప్పటికే సర్వం సహా ఇష్టారాజ్యమైన వ్యవస్థను నెలకొల్పుకున్నారు. చంద్రబాబు నాయుడి హయాంలోనే మూడేళ్లు ఇలా గడిచిపోయింది. అమరావతిలో అరకొర వసతుల కారణాన్ని సాకుగా చెబుతూ వచ్చారు ఉద్యోగులు . వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే మూడు రాజధానుల పల్లవి అందుకోవడంతో వారికి మరింతగా కలిసి వచ్చింది. అనిశ్చిత పరిస్థితిలో వారిని పట్టించుకునే నాథుడు కరవు అయ్యాడు. విభాగాధిపతులు, కార్యదర్శులు చూసీచూడనట్లు వ్యవహరించసాగారు. అందులోనూ గడచిన ఏడాదిన్నర కాలంగా కరోనా పేరుతో ఎవరూ సరిగా కార్యాలయాలకు రావడం లేదు. హైదరాబాదులో కుటుంబాలు ఉన్నవారు సాకులు చెబుతూ అక్కడే గడుపుతున్నారు. బయోమెట్రిక్ విధానంలో అటెండెన్స్ కూడా నిలిపివేయడంతో వచ్చినా రాకపోయినా అడిగేవారు ఉండటం లేదు. పైపెచ్చు అంతా కలిసి సెలవులను పంచుకునే కొత్త పద్ధతిని పెట్టుకున్నారు. దీనివల్ల నామమాత్రంగానే విధులకు వస్తున్నప్పటికీ, అందరూ డ్యూటీలో ఉన్నట్లుగానే చూపించుకుంటున్నారు. పై అధికారులు పట్టించుకోవడం లేదు. ఇప్పటికే క్రమశిక్షణ రాహిత్యం నెలకొంది.ఉద్యోగులకు ముఖ్యమంత్రులు ఆదర్శంగా ఉండాలి. తెలంగాణ ముఖ్యమంత్రి సచివాలయానికి ఏనాడూ రాలేదు. ఇప్పుడైతే కొత్త సచివాలయం నిర్మాణం చేపట్టారు. మరో ఏడాది వరకూ అది సాగుతూనే ఉంటుంది. ఏపీలో కొత్తలో హడావిడి చేసిన ముఖ్యమంత్రి జగన్ కొంతకాలంగా సచివాలయానికి రావడం లేదు. క్యాంపు ఆఫీసు నుంచే పనులు చక్కబెడుతున్నారు. ఇవన్నీ ఉద్యోగుల్లో అలసత్వానికి కారణమవుతున్నాయి. ప్రత్యేకించి ఆంధ్రప్రదేశ్ లో ఆరేడు నెలలుగా జీతాలు ఆలస్యం అవుతున్నాయి. దాంతో ప్రభుత్వం ఒత్తిడికి గురవుతోంది. దీనిని ఆసరా చేసుకుంటూ ఉద్యోగులు నిర్లక్ష్యంగా ఉంటున్నట్లు ముఖ్యమంత్రికి ఫిర్యాదులు అందాయి. నిజానికి రెండు రాష్ట్రాల్లోనూ వేతనాల భారం భారీగా పెరిగిపోయింది. సగటున ప్రభుత్వానికి వస్తున్న ఆదాయంలో అరవై శాతం ఉద్యోగుల జీతభత్యాలు, పింఛన్లకే ఖర్చు పెట్టాల్సి వస్తోంది. ఇక మిగిలిన నిధులు సంక్షేమం పద్దులో పడుతున్నాయి. అభివృద్ధి చేయాలంటే అప్పులు తేవాల్సిందే. ఉద్యోగ సంఘాలు, అధికారులు అంతా ఒకే మాట, ఒకే బాటగా ప్రభుత్వం కళ్లు గప్పుతున్నారనే వాదన వినవస్తోంది. ఐఎఎస్ స్థాయి అధికారులు కూడా విధులను నిర్లక్ష్యం చేయడం ఇటీవలి కాలంలో సర్వసాధారణమై పోయిందని విమర్శలు వస్తున్నాయి. ఏదేమైనా ఇప్పటికైనా ముఖ్యమంత్రుల స్థాయిలో శ్రద్ధ పెట్టి శాఖలవారీ తనిఖీలు నిర్వహించడం అవసరం. అంతేకాకుండా సీఎంలు సెక్రటేరియట్ లకు హాజరవుతుంటే ఉద్యోగులు తప్పనిసరిగా వస్తారు. ముందుగా తాము ఆచరించి చూపించడమే సమస్యకు పరిష్కారం

## రెండు సామాజిక వర్గాలకు వెన్నుదన్ను

విజయవాడ, ఆగస్టు 17, (న్యూస్ పల్స్)ఏపీలో కమ్మలు ఒక విధంగా చెప్పాలంటే కొంత కలవరంతోనే ఉన్నారనుకోవాలి. నాలుగు దశాబ్దాలుగా తెలుగుదేశం చల్లని నీడలో అన్ని విధాలుగా ఎదిగిన వారికి ఇపుడు చుక్కలు కనిపిస్తున్నాయి. లెక్కలు తేలుస్తామంటూ జగన్ సర్కార్ దూకుడు చేస్తోంది. గత రెండున్నర ఏళ్ల వైసీపీ పాలనలో కమ్మలు టార్గెట్ అవుతున్నారు అన్న బాధ అయితే ఆ సామాజిక వర్గంలో ఉంది. ఇక తెలుగుదేశం పార్టీని తప్పనిసరిగా నమ్ముకుంటున్నా కూడా వేరే ఇతర మార్గాల కోసం కూడా కమ్మలు అన్వేషిస్తున్నారు.ఏపీలో కమ్మలు టీడీపీ మీద ఒక విధంగా అపనమ్మకంతోనే ఉన్నారు. చంద్రబాబుకు అవుట్ రేట్ గా మద్దతు ఇచ్చినా 2024 ఎన్నికల్లో టీడీపీ అధికారంలోకి వస్తుందా అన్న చింత అయితే ఉంది. ఇక లోకేష్ మీద వారికి పెద్దగా ఆశలు అయితే లేవు. అందుకే జూనియర్ ఎన్టీయార్ కోసం రాయబేరాలు పై స్థాయిలో జరుగుతున్నాయని అంటున్నారు. ఇవన్నీ ఇలా ఉండగా పవన్ కళ్యాణ్ తాజాగా స్వాతంత్ర దినోత్సవ వేళ చేసిన కామెంట్స్ కమ్మలకు గట్టి భరోసా ఇచ్చినట్లుగా ఉందని అంటున్నారు. ఒక సామజిక వర్గాన్ని కోరి టార్గెట్ చేయడం మంచిది కాదు అంటూ ఆయన జగన్ కి నేరుగానే హెచ్చరికలు పంపించారు.రాజకీయ కక్షలను పాలనలో చూపించి శిక్షలు విధించడం మంచి పరిణామం కాదని కూడా పవన్ కల్యాణ్ అంటున్నారు. ఆ విధంగా ఆయన చేసిన ప్రకటన కమ్మలకు పూర్తి స్వాంతన చేకూర్చింది అనే చెబుతున్నారు. కమ్మలు కోరుకునేది కూడా ఇదే. జనంలో విశేష ఆదరణ ఉన్న పవన్ కళ్యాణ్ లాంటి వారు తమకు అండగా ఉంటే రేపటి రోజున రాజకీయంగా మళ్ళీ అద్భుతాలు జరుగుతాయని కూడా వారు అంచనా వేస్తున్నారు. పవన్ సైతం తన రాజకీయాన్ని కేవలం కాపుల వద్దనే ఆపేసి కుల నాయకుడిగా మిగిలిపోదలచుకోలేదు అంటున్నారు. పైగా కమ్మ కాపు కాంబో కోసం ఆయన గట్టిగానే కృషి చేస్తున్నారు అని చెబుతున్నారు.ఏపీలో కమ్మలు, కాపుల మధ్య సామరస్యం ఉంటే 2014 నాటి ఎన్నికల ఫలితాలే 2024లో కూడా రిపీట్ అవుతాయని అంటున్నారు. పవన్ కమ్మల విషయంలో ఇలా వెనకేసుకురావడం వెనక వ్యూహం కూడా అదేనని అంటున్నారు. కమ్మలు కాపుల మధ్య స్నేహ బంధం గట్టిగా ఉంటే రేపటి రోజున టీడీపీ జనసేన పొత్తులు కూడా పూర్తిగా సక్సెస్ అవుతాయని కూడా భావిస్తున్నారు. పవన్ కల్యాణ్ తన పక్కన కమ్మ సామాజిక వర్గానికి చెందిన నాదెండ్ల మనోహర్ ని ఉంచుకోవడం వెనక కూడా అంతరార్ధం ఇదేనని అంటున్నారు. ఇక టీడీపీతో పవన్ చేయి కలిపేందుకు ఈ ప్రకటన తొలి మెట్టుగా కూడా భావిస్తున్నారు. మొత్తానికి రేపటి రోజున టీడీపీతో వెళ్ళినా ఫ్యూచర్ లో ఆ సామాజిక వర్గం మద్దతు దండీగా తనకే దక్కేలా పవన్ ఇప్పటి నుంచే కసరత్తు చేస్తున్నారు అంటున్నారు. చూడాలి మరి ఈ కాంబోను జగన్ ఎలా తట్టుకుని ముందుకు సాగుతారో.

## బాబుల మధ్యకు వివాదాలకు ఫుల్ స్టాప్ ఎప్పుడు

తిరుపతి, ఆగస్టు 17, (న్యూస్ పల్స్)సినిమా రంగంలో మోహన్ బాబు తిరుగులేని నటుడు. ఆయన హీరోగా కెరీర్ మొదలెట్టి ఆ తరువాత విలన్ గా అదరగొట్టారు. తిరిగి హీరోగానూ చేసి కలెక్షన్ కింగ్ అనిపించుకున్నారు. అయితే మోహన్ బాబుకు విలన్ గా ఉన్న మోజూ క్రేజూ వేరు. ఆయన మ్యానరిజంతో పాటు రూటే సేపరేటు. అలాంటి మోహన్ బాబు నా కంటే పెద్ద విలన్ ఒకరు ఉన్నారు అంటున్నారు. ఆయనని మోసం చేసిన టీడీపీ అధినేత చంద్రబాబే అసలైన విలన్ ట. నా కంటే గొప్ప నటుడు చంద్రబాబు అని సొంత మామ ఎన్టీయార్ నాడు సెటైరికల్ గా కితాబు ఇస్తే ఇపుడు మోహన్ బాబు తన కంటే బాబే భలే విలన్ అంటున్నారు.హెరిటేజ్ ఫుడ్స్ పేరు చెబితే చంద్రబాబు పేరు వేరేగా చెప్పనక్కరలేదు. అలా దశాబ్దాలుగా బాబుతో బంధం వేసుకున్న సంస్థ అది. అలాంటి సంస్థ నాది అని మోహన్ బాబు అంటున్నారు అంటే ఆశ్చర్యమే. నిజానికి హెరిటేజ్ ఐడియా నాది పెట్టుబడులు కూడా నావే ఎక్కువ. షేర్లు కూడా నావే అధికమని మోహన్ బాబు తాజాగా ఒక మీడియా ఇంటర్వ్యూలో అసలు గుట్టు విప్పారు. లాభాల బాటలో ఉన్న హెరిటేజ్ నుంచి తనను బలవంతంగా చంద్రబాబు బయటకు వెళ్ళగొట్టారంటూ మోహన్ బాబు ఆక్రోశించారు కూడా. ఒక విధంగా చంద్రబాబు చేసిన మోసాన్ని తాను ఈ రోజుకీ భరించలేకపోతున్నాను అంటూ తెగ బాధపడ్డారు ఆయన.ఇక రాజ్యసభకు ఎంపీగా తనను ఎన్టీయార్ నమ్మి పంపిస్తే చంద్రబాబు దాన్ని రెన్యువల్ చేయలేదని కూడా మోహన్ బాబు వాపోయారు. తాను సమర్ధుడైన నాయకుడిగా బాబు కళ్ళకు కనిపించలేదేమో అంటూ సెటైర్లు వేశారు. రాజకీయంగా తన ఎదుగుదలా బ్రేకులు వేసి టీడీపీ నుంచి వెళ్ళగొట్టిన ఘనత కూడా చంద్రబాబుదేనటూ ఫ్లాష్ బ్యాక్ ని మరోమారు కళ్ళకు కట్టినట్లుగా చూపించారు. తాను రాజకీయాల పట్ల విసుకు చెందడానికి కూడా ఆ పరిణామాలే కారణమని ఆయన ఆవేదన చెందారు.నిజం చెప్పాలీ అంటే మోహన్ బాబుదీ చంద్రబాబుదీ ఒకే జిల్లా. ఇద్దరూ దగ్గర బంధువులు కూడా. ఇక మోహన్ బాబుకు ఎన్టీయార్ తో పాటు చంద్రబాబు వద్ద కూడా మంచి చనువు ఉంది.

అలాంటి చంద్రబాబుతో వైరం రావడం అంటే చిత్రమే. అయితే రాజకీయాలలో శత్రువులు మిత్రులు ఉండరు. కానీ మోహన్ బాబు మాత్రం తన శత్రుత్వం మరచిపోనిదీ ఈ జన్మకు వీడనిదే అంటున్నారు. చంద్రబాబు చేసిన అన్యాయంతోనే తాను టీడీపీ నుంచి వేరుపడ్డానని, మరే పార్టీలో కూడా ఇప్పటిదాకా చేరలేదని ఆయన అంటున్నారు. ఇక చంద్రబాబు సీఎం కావడానికి తెర వెనక మోహన్ బాబు కూడా ఎంతో కృషి చేశారు. కానీ అవసరం తీరాక బాబు ఆయన్ని పక్కన పెట్టడంతో ఈ కలెక్షన్ కింగ్ ఈ రోజుకీ దాన్ని జీర్ణించుకోలేకపోతున్నారు. మొత్తానికి ఇద్దరు బాబులూ ఏడు పదుల వయసు దాటేశారు. సినీ రంగాన లబ్ద ప్రతిష్టుడిగా మోహన్ బాబు ఉంటే రాజకీయాల్లో రాటుదేలారు చంద్రబాబు. కానీ జీవిత చరమాంకంలో కూడా ఇలా శత్రువులుగా ఉండడం సాటివారికి కూడా ఆశ్చర్యం కలిగిస్తోంది. మోహన్ బాబు ముక్కుసూటి తనం వల్లనే ఇద్దరూ కలవలేకపోతున్నారు అన్న మాట అయితే ఉంది.

## ట్రెండ్ మార్చిన లోకేష్



గుంటూరు, ఆగస్టు 17, (న్యూస్ పల్స్)తెలుగుదేశం పార్టీ భావి సారధిగా నారా లోకేష్ ను చేసేందుకు గట్టి శిక్షణే ఇస్తున్నారు ఆయన తండ్రి చంద్రబాబు. లోకేష్ నాయకత్వంపై పార్టీలో కొన్ని అనుమానాలు, అపనమ్మకాలు మెజారిటీ నేతల్లో ఉన్నాయి. ముఖ్యంగా టిడిపి ఆవిర్భావం నుంచి ఆ పార్టీ వెన్నంటి నడిచిన నేతల్లో ఈ అపనమ్మకం మరి ఎక్కువగా ఉంది. దీనికి ప్రధాన కారణం లోకేష్ మంత్రిగా కీలకమైన శాఖలు నిర్వహించినా అనుకున్న మైలేజ్ తెచ్చుకోలేకపోయారు. గతంలో జీహెచ్ఎంసి ఎన్నికల్లో టిడిపి ఘోర వైఫల్యాలను లోకేష్ నాయకత్వంలోనే పార్టీ చవి చూసింది. ఇక 2019 ఎన్నికల్లో స్వయంగా మంగళగిరి లో ఆయనే ఓటమి పాలయ్యారు. ఇక ట్విట్టర్ వేదికగా విజృంభించడం తప్ప క్షేత్ర స్థాయిలో ఆయన దూసుకె?ళ్లలేకపోతున్నారు అనేవి టిడిపి యువరాజు నాయకత్వంపై అపనమ్మకాన్ని ప్రధాన కారణాలుగా విశ్లేషిస్తారు.ఎన్టీఆర్ టిడిపి వ్యవస్థాపకుడు. ఆయనకు వెన్నుపోటు పొడిచి పార్టీని కైవసం చేసుకున్నారనే అపవాదును చంద్రబాబు భరిస్తున్నా పార్టీకి దిక్కుమొక్కుగా నిలిచి పసుపు దళాధిపతిగా పాతికేళ్ళుగా సమర్ధంగా ప్రస్థానం సాగిస్తున్నారు. ఈ ప్రయాణంలో ఎన్నో ఆటుపోట్లను చంద్రబాబు సమర్ధంగా ఎదుర్కోవడమే కాదు. ప్రతిపక్షంలో ఉన్నా అధికారపక్షానికి చుక్కలు చూపించడంలో బాబు చాణక్య రాజకీయాలు దేశవ్యాప్తంగా ఒక ట్రెండ్ అనే చెప్పొచ్చు. ఇప్పుడు అలాంటి చాణుక్యుడి వారసుడిగా లోకేష్ సిద్ధం అవుతున్నా, సమర్ధత లేకుండా ఆయనకు పార్టీ పగ్గాలు అప్పగిస్తే ఇక ఇంతే సంగతి అన్న సందేహాలు చాలామంది సీనియర్లను వేధిస్తున్నాయి. దీంతో గత కొంతకాలంగా లోకేష్ పూర్తిస్థాయిలో ట్రెండ్ మార్చేశారు. అలా బాబు తయారు చేసుకుంటున్నారు అనడం వాస్తవం అని చెప్పాలి.పార్టీలో ముఖ్య నేతలకు సంబంధించి మంచి చెడుల్లో నే ఉన్నా అంటూ ప్రతి ఒక్కరిని కలిసే ప్రయత్నం మొదలు పెట్టారు నారా లోకేష్. కార్యకర్తలతోను సోషల్ మీడియా ద్వారా టచ్ లో ఉండేందుకు నిత్యం ప్రయత్నం చేస్తున్నారు. గతంలో పార్టీ పెట్టినప్పుడు కానీ ప్రధాన విపక్ష నేతగా ఉన్నప్పుడు వైసిపి అధినేత వైఎస్ జగన్ 9 ఏళ్ళపాటు ప్రజల్లోనే ఉండేవారు. అసెంబ్లీకి సైతం దుమ్మా కొట్టి మరీ ఆయన జనంతో మమేకం అయ్యేవారు. ఓదార్పు యాత్ర మొదలు జగన్ తన పాదయాత్ర వరకు ప్రజలను నేరుగా కలిసేవారు. దాంతో లీడర్ గా ఆయన తిరుగులేకుండా ఎదిగారు. అంతేకాదు తన పార్టీని అఖండ మెజారిటీని తెచ్చిపెట్టారు.ఇప్పుడు ఇదే ఫార్ములాలో లోకేష్ ముందుగా వివిధ జిల్లాల పర్యటనకు వెళుతూ పార్టీ క్యాడర్ ను ఆకళింపు చేసుకోవడం మొదలు పెట్టారు. తాత ఎన్టీఆర్ విగ్రహాల ఏర్పాటుచేయించి వాటిని తానె ప్రారంభించి నారా నందమూరి మధ్య గ్యాప్ లేదనే సందేశాన్ని తీసుకువెళుతున్నారు. ఇక ప్రజలతో నేరుగా టచ్ లోకి వెళ్లేందుకు కరోనా బాగా తగ్గాకా ఆయనకోసం కార్యాచరణ సిద్ధం చేస్తున్నట్లు తెలుస్తుంది. ఈ వ్యూహాలన్నీ లోకేష్ కు టిడిపికి ఏ మేరకు మైలేజ్ తెస్తాయో వేచి చూడాలి.

## విశాఖలో కమలానికి లీడర్లు...కావలెను



విశాఖపట్టణం, ఆగస్టు 17, (న్యూస్ పల్స్)బీజేపీకి అత్యంత కీలకమైన ఉత్తరాంధ్రలోని విశాఖపట్నం జిల్లాలో ఇప్పుడు పార్టీ కీలక నాయకుడిని దూరం చేసుకున్నట్టు అయింది. ఇక్కడ చక్రం తిప్పిన.. కీలక నేత.. కంభం పాటి హరిబాబు ఇటీవల మిజోరం రాష్ట్ర గవర్నర్‌గా ప్రమోషన్‌పై వెళ్లిపోయారు. దీంతో ఆయన ప్రభావం దాదాపు తగ్గిపోతుంది. ఇక, ఇప్పటికి ఉన్న నేతల్లో ఎమ్మెల్సీ మాధవ్ పేరు ప్రధానంగా వినిపిస్తున్నా.. ఈయనకు పోటీగా కేంద్ర మాజీ మంత్రి దగ్గుబాటి పురందేశ్వరి కూడా దూకుడు చూపిస్తారని అంటున్నారు. గతంలో ఇక్కడ నుంచి పోటీ చేసి ఎంపీగా కూడా గెలిచిన ఆమె గత ఎన్నికల్లో ఓడిపోయారు.అయితే.. అప్పటి వరకు హరిబాబు ప్రభావం ఉందని.. అందుకే కొందరు నేతలు పుంజుకోలేక పోతున్నారనే వాదన వినిపించేది. కానీ, ఇప్పుడు హరిబాబు బీజేపీకి దూరమయ్యారు. ఆయన ప్రభావం ఉండే అవకాశం లేదు. దీంతో ఇప్పుడు కీలకమైన విశాఖ రాజకీయాల్లో పట్టు సాధించేది ఎవరు? అనే ప్రశ్న తెరమీదికి వచ్చింది. ఇటీవల ఎమ్మెల్సీ మాధవ్ ఉత్తరాంధ్ర జిల్లాలో గాంధీ సంకల్ప యాత్ర పేరిట సమస్యలు తెలుసుకునే ప్రయత్నం చేశారు. దీనిపై పెద్దగా ఫోకస్ రాకపోయినా.. ఆయన మాత్రం విశాఖపై పట్టు బిగించేందుకు ప్రయత్నిస్తున్నారు. ముఖ్యంగా కొన్ని దశాబ్దాలుగా ఉన్న సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తున్నానని ఆయన చెబుతున్నారు.కానీ, విశాఖపై పట్టు సాధించాలంటే.. కీలకమైన రెండు పార్టీలు.. వైసీపీ, టీడీపీలను బలంగా ఎదుర్కొనాల్సిన అవసరం ఉంటుందని.. పైగా పారిశ్రామికంగా , సామాజిక వర్గం పరంగా కూడా పట్టు సాధించాల్సి ఉంటుందని పరిశీలకులు చెబుతున్నారు. ఈ పరిణామాలను గమనిస్తే.. మాధవ్ ఈ తరహా రాజకీయం చేసే పరిస్థితి లేదని.. కుండబద్దలు కొడుతున్నారు. ఏదైనా ఉంటే.. పురందేశ్వరి వంటి బలమైన సామాజిక వర్గం అండదండలు ఉన్న నాయకురాలు వస్తే.. బాగానేఉంటుందని అంటున్నారు. అయితే.. ఆమె రాకను ఇక్కడి బీజేపీ నేతలు జీర్ణించుకోలేకపోతున్నారు.ఇక ఎక్కడో ప్రకాశం జిల్లాకు చెందిన ఆమె గతంలో కాంగ్రెస్ నుంచి ఇక్కడ ఎంపీ అవ్వడంతో పాటు కేంద్ర మంత్రి అయ్యి పెత్తనం చేశారు. ఇప్పుడు బీజేపీలో కూడా ఆమెకు ఇక్కడ ప్రధాన బాధ్యతలు ఇస్తే ఇక్కడే పాత?కుపోయి? తమపై పెత్తనం చేస్తారని.. స్థానికేతరురాలని.. అంతర్గత ప్రచారం చేస్తున్నారు. దీంతో విశాఖపై పట్టు సాధించడం బీజేపీ నేతలు కత్తిమీద సాముగా మారిందని అంటున్నారు. ఏదేమైనా విశాఖ బీజేపీకి ఇప్పుడు అర్జెంటుగా ఓ లీడర్ అయితే కావాల్సి ఉంది. మరి ఈ లోటును ఎవరు భర్తీ చేస్తారో ? చూడాలి.

## విశాఖకు మరో ఉపద్రవమా..

విశాఖపట్టణం, ఆగస్టు 17, (న్యూస్ పల్స్)శాఖపట్నం ఆసియా ఖండంలోనే వేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రాంతం. స్మార్ట్ సిటీ అని దానికి పేరు. ఇక జగన్ సర్కార్ అయితే విశాఖను పాలనా రాజధానిగా కూడా ప్రతిపాదిస్తూ చట్టం చేసింది. అది ప్రస్తుతం న్యాయ సమీక్షలో ఉంది. ఇవన్నీ పక్కన పెడితే విశాఖకు పెను ముప్పు అంటూ తరచూ వార్తలు రావడం జిల్లా వాసులను కలవరపెట్టే అంశంగా ఉంది. ఇందులో శాస్త్రీయత ఎంత ఉందో అన్నది పక్కన పెడితే దానికి మించి రాజకీయమే ఉందని మేధావులు కూడా అనుమానిస్తున్నారు. విశాఖను రాజధానిగా ఎపుడైతే ప్రకటించారో నాటి నుంచి ఈ నగరం భద్రత మీద నీలినీడలు కమ్ముకునేలా వరసబెట్టి వార్తలు వస్తున్నాయి.విశాఖ దేశంలోని అతి ముఖ్య నగరం. ప్రగతి బాటన సాగుతున్న ప్రాంతం. ఈ నగరానికి ముప్పు ఉందని తాజాగా అమెరికాలోని నాసా పరిశోధనలు వెల్లడించాయి. కేవలం విశాఖ మాత్రమే కాదు, ముంబై, చెన్నై, కొచ్చి వంటి పన్నెండు భారతీయ నగరాలకు ముప్పు ఉందని కూడా లెక్క తేల్చారు. అంతే కాదు ఆసియా ఖండంలోని చాలా తీర ప్రాంత నగరాలకు కూడా ఈ ఉపద్రవం పొంచి ఉందని కూడా హెచ్చరించారు. ఇదంతా ఎపుడూ అంటే మరో ఎనభై నుంచి వందేళ్ల లోపు. మరి అప్పటికి కూడా తగిన చర్యలు తీసుకోకపోతేనే ఇలాంటివి ముంచుకొస్తాయని అంటున్నారు. అది కూడా మొత్తం నగరాలకు నగరాలు మునగవు, కొన్ని ముందు ప్రాంతాలు సముద్ర నీటి మట్టం ఎత్తు పెరగడం వల్ల మునుగుతాయని అంటున్నారు.ఏపీలో ఈ రోజుకూ చెప్పుకోదగిన నగరం విశాఖ తప్ప మరేమీ లేదు. అలాంటి నగరం మీద బురద జల్లడానికి ఒక రాజకీయ పార్టీకి అనుకూలంగా ఉండే మీడియా అతి ఉత్సాహం చూపుతోందని విమర్శలు అయితే ఉన్నాయి. విశాఖ పారిశ్రామిక నగరం. మరి రసాయన పరిశ్రమలు ఉంటాయి. వాటి వల్ల ఇబ్బంది వచ్చి ఏ క్షణాన అయినా భస్మీపటలం అయిపోతుందని వార్తలు వండుతారు. సముద్రపు ఒడ్డున సిటీ ఉంది కాబట్టి సాగర గర్భంలో భూ కంపం వచ్చి సిటీ కొట్టుకుపోతుందని కూడా అంటారు. విశాఖకు సునామీ ప్రమాదం అంటారు. మరి అభివృద్ధి మాటున కొన్ని విపత్తులు కూడా ఉంటాయి. వాటిని సరిచేసుకోవాలి. దానికి తగిన మేనేజ్మెంట్ ని రూపొందించుకోవాలి. అంతే తప్ప మునిగిపోతుందని విష ప్రచారం చేయడం ఎంతవరకూ మంచిది అన్న మాట అయితే ఉంది.విశాఖ అయితే ఇంకా రాజధాని అవలేదు, కాబట్టి మునిగే సిటీకి రాజసం ఎందుకు అంటూ ఒక సెక్షన్ ఆఫ్ మీడియా రాతలు రాస్తోంది. మరి ముంబై, చెన్నై రాజధానులే కదా. అవి మునిగిపోతాయి అంటే ఇప్పటికిపుడు రాజధానులను మార్చేస్తారా. ప్రకృతి విపత్తుల నుంచి తగిన రక్షణకు ఎప్పటికపుడు చర్యలు చేపట్టడం ద్వారా అధిగమించవచ్చు. మరో వందేళ్లలో ఉపద్రవం జరగబోతోంది అని విశాఖను ఖాళీ చేయించే విధంగా భయానకమైన పరిస్థితి సృష్టిస్తే అది రాజకీయంగా బాగుంటుందేమో కానీ ఆంధ్రా భవిష్యత్తుకు మేలు చేసే విషయమేనా అన్నది కూడా ఆలోచించాలి కదా అంటున్నారు మేధావులు. మొత్తానికి విశాఖ రాజధాని అని చెప్పకపోతే ఏ చిక్కూ ఉండేది కాదు కదా అన్నది సగటు జనం మనోగతంగా ఉంది.

## ఉపాధి బిల్లుల టెన్షన్

విజయవాడ,ఆగస్టు 17, (న్యూస్ పల్స్)వైసీపీ తరుపున ఎంపీగా గెలిచి..అదే పార్టీకి వ్యతిరేకంగా మాట్లాడుతున్న ఎంపీ రఘురామకృష్ణం రాజు మరొకసారి జగన్ ప్రభుత్వాన్ని బుక్ చేసినట్లే కనిపిస్తోంది. ఇప్పటికే ఢిల్లీలో కూర్చుని తనదైన శైలిలో రాజకీయం చేస్తూ, జగన్ ప్రభుత్వాన్ని ఇరుకున పెడుతున్న రఘురామ, టీడీపీకి బెనిఫిట్ అయ్యేలా వైసీపీని బుక్ చేశారు. ఇప్పటికే రఘురామ, చంద్రబాబులు కలిసి తమ ప్రభుత్వంపై కుట్ర చేస్తున్నారని వైసీపీ ఎంపీలు..రఘురామపై అనర్హత వేటు వేయించడానికి నానా కష్టాలు పడుతున్నారు.ఢిల్లీ పెద్దల సపోర్ట్ ఉండటంతో రఘురామపై వేటు పడటం లేదు. పైగా ఆయన ఢిల్లీలో ఉంటూ వైసీపీ ప్రభుత్వాన్ని ఆడేసుకుంటున్నారు. తాజాగా ఉపాధి హామీ నిధుల విషయంలో కేంద్రం, జగన్ ప్రభుత్వానికి షాక్ ఇచ్చేలా చేశారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో పెండింగ్‌లో ఉన్న ఉపాధి హామీ బిల్లులని జగన్ ప్రభుత్వం చెల్లించకుండా తాత్సారం చేస్తున్న విషయం తెలిసిందే. దీనిపై టీడీపీ కోర్టుకు కూడా వెళ్లింది. హైకోర్టు సైతం ఉపాధి బిల్లులని వెంటనే చెల్లించాలని జగన్ ప్రభుత్వాన్ని ఆదేశించింది.అయినా సరే ప్రభుత్వం మాత్రం బిల్లులని చెల్లించలేదు. అంటే గత ప్రభుత్వంలో టీడీపీ నేతలు కాంట్రాక్టులు తీసుకుని ఉపాధి పనులు చేయించారని జగన్ ప్రభుత్వం బిల్లులు చెల్లించడం లేదు. ఈ అంశంపై టీడీపీ గట్టిగానే పోరాడుతున్నారు. ఇక టీడీపీ పోరాటానికి రఘురామ మద్ధతుగా వచ్చి, ఉపాధి హామీ పనులకు మీరిస్తున్న నిధుల్ని జగన్ ప్రభుత్వం చెల్లించడం లేదంటూ కేంద్రమంత్రి గిరిరాజ్ సింగ్‌కు రఘురామ లేఖ రాశారు. ఆ నిధులు వెనక్కి తీసుకోవాలంటూ కేంద్రమంత్రిని కోరారు.ఈ క్రమంలోనే కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి లేఖ రాసింది. రఘురామ లేఖపై సమగ్ర వివరణ పంపాలంటూ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరింది. దీంతో జగన్ ప్రభుత్వం ఇరుకున పడ్డట్లు అయింది. రాష్ట్రం సరైన వివరణ ఇవ్వకపోతే ఉపాధి నిధుల విషయంలో కేంద్రం సీరియస్ అయ్యేలా కనిపిస్తోంది. అసలే అప్పులుతో ఇబ్బందులు పడుతున్న జగన్ ప్రభుత్వాన్ని, రఘురామ గట్టిగా కోర్టులో 492 పిటీషన్లు పాధి హామీ పథకం పనుల పై హైకోర్టులో ఏకంగా 492 పిటిషన్లు దాఖలయ్యాయి. సోమవారం ఈ పిటిషన్ పై హైకోర్టులో విచారణ జరిగింది. అన్ని కేసులలో విజిలెన్స్ విచారణ వేశామని ప్రభుత్వం తరపున న్యాయవాది తెలిపారు. కాగా అన్ని కేసులలో విజిలెన్స్ విచారణ వేయలేదని పిటిషనర్ల తరఫు న్యాయవాదులు తెలిపారు.100 పిటిషన్ల విషయంలో డబ్బులు చెల్లించామని ప్రభుత్వం తరపున న్యాయవాది స్పష్టం చేశారు.అయితే ఏ కేసులో ఎంత డబ్బు చెల్లించారో.. విజిలెన్స్ విచారణ ఎంతవరకు వచ్చింది..? పిటిషనర్ ల సమక్షంలోనే విచారణ చేస్తున్నారా.. విచారణ ఎప్పుడు చేశారు లాంటి వివరాలను ఇవ్వాలని హైకోర్టు ఆదేశించింది. విచారణ పూర్తయిన 20 శాతం మినహాయించి బిల్లులు చెల్లిస్తున్నామని ప్రభుత్వం తరఫు న్యాయవాది తెలిపారు. దాంతో పూర్తి వివరాలు అందించాలని హైకోర్టు ఆదేశాలు ఇస్తూ కేసు విచారణను వాయిదా వేసింది.

## శ్రీశైలానికి తగ్గిన వరదప్రవాహం

కర్నూలు,ఆగస్ట్17(: ఎగువ ప్రాంతాల నుంచి శ్రీశైలం జలాశయానికి వరద తగ్గింది. గత కొద్ది రోజులుగా వర్షాలు ముఖం చాటేయడంతో ప్రవాహం తగ్గుముఖం పట్టింది. ప్రస్తుతం శ్రీశైలం జలాశయానికి 21,121 క్యూసెక్కుల ఇన్‌ఎ÷-లో వస్తున్నది. ప్రాజెక్టు గరిష్ఠ నీటిమట్టం 885 అడుగులు కాగా.. ప్రస్తుతం 879.80 అడుగులమేర నీరుంది. పూర్తిస్థాయి నీటి నిల్వ 215 టీఎంసీలకు గాను.. ప్రస్తుత నీటినిల్వ 187.70 టీఎంసీలున్నది.

# కన్నబాబు స్థానంలోకి.. జక్కంపూడి

కాకినాడ, ఆగస్టు 17, (న్యూస్ పల్స్)మరికొంతకాలంలో జగన్ క్యాబినెట్ పదవీకాలం రెండున్నరేళ్ళు పూర్తి చేసుకోబోతుంది. తన టర్మ్ లో మంత్రుల కాలపరిమితి సగమే అన్నది ప్రమాణ స్వీకారం నాడే వైసిపి అధినేత ముఖ్యమంత్రి జగన్ స్పష్టం చేసేశారు. దాంతో పార్టీలో మంత్రి పదవులపై ఆశలు పెట్టుకున్నవారి ఆశలు ఇంకా సజీవంగానే ఉన్నాయి. ఈ నేపథ్యంలో వైఎస్ జగన్ తొలి క్యాబినెట్ లో స్థానం సంపాదించుకున్న కురసాల కన్నబాబు ప్రస్తుతం వ్యవసాయ మంత్రిగా కీలక బాధ్యతలు వహిస్తున్నారు. ప్రస్తుతానికి ఆయనపై జగన్ దగ్గర మంచి మార్కులే తప్ప రిమార్కు లు లేవు. దానికి తోడు పార్టీ వ్యవహారాల్లోనూ ప్రభుత్వ కార్యకలాపాల్లో కన్నబాబు ముఖ్యమంత్రికి సన్నిహితంగా ఉండటంతో బాటు అటు విజయసాయి, సజ్జల రామకృష్ణ రెడ్డి, వైవి సుబ్బారెడ్డి వంటి కోటరీ తో కూడా సఖ్యతగానే ఉంటూ వస్తున్నారు. ఈ నేపథ్యంలో క్యాబినెట్ మార్పు అంశం లో జగన్ అన్నమాటకే నిలబడితే కన్నబాబు స్థానం ఉంటుందా లేకా మార్పు జరుగుతుందా అన్న చర్చ ఇప్పటినుంచే తూర్పుగోదావరి జిల్లాలో జోరుగా సాగుతుంది.సామాజిక వర్గం కోటాలో కురసాల కన్నబాబు కి జగన్ కీలకమైన క్యాబినెట్ పదవి కట్టబెట్టారు. ఆయన్ను మార్చాలిసి వస్తే అదే జిల్లా నుంచి అదే సామాజికవర్గం నుంచి మరొకరికి ఇవ్వాలిసి ఉంటుంది. ఆ అంశానికి వస్తే ప్రస్తుతం వైసిపి స్థాపించాకా రెండోసారి కూడా యనమల కోటలో పాగా వేసిన ప్రస్తుత చీఫ్ విప్ దాడిశెట్టి రాజా ముందు వరుసలో ఉంటారు. రెండు సార్లు వరుసగా ఫ్యాన్ పార్టీ గుర్తుపై గెలిచిన రాజా జగన్ అధికారంలోకి వచ్చాకా మంత్రి పదవి గ్యారంటీ అనుకున్నారు. కానీ అనూహ్యంగా కన్నబాబు కి మంత్రి పదవి ఇచ్చి రాజా కు విప్ తో సరిపెట్టారు జగన్. దాంతో ఈసారి ఆయనకు కన్నబాబు ను మారిస్తే దాడిశెట్టికి లాటరీ తగిలే అవకాశాలు మెండుగా ఉన్నాయని ఆయన అనుచరుల్లో బలంగా వినిపిస్తున్న మాట. కుటుంబంతో పాటు తొలి నుంచి ప్రయాణం చేస్తున్న వారిలో మాజీమంత్రి జక్కంపూడి రామ్మోహన రావు కుటుంబం తూర్పుగోదావరి జిల్లాల్లో ముందు వరుసలోనే ఉంది. ఈ నేపథ్యంలో ఆయన తనయుడు రాజానగరం ఎమ్మెల్యే, రాష్ట్ర కాపు కార్పొరేషన్ ఛైర్మెన్ జక్కంపూడి రాజా కు ముఖ్యమంత్రి జగన్ టిక్ పెట్టె అవకాశాలు కొట్టిపారేయలేమని అంటున్నారు. వైఎస్ కుటుంబం పట్ల జక్కంపూడి కుటుంబం చూపే విధేయత రాజా కు కలిసివచ్చే అవకాశాలు ఉన్నాయంటున్నారు. రామ్మోహన రావు ప్రాతినిధ్యం వహించిన నియోజకవర్గం నుంచి రాజానగరం నియోజకవర్గానికి టికెట్ మార్చినా రాజా మంచి మెజారిటీ తో గెలుపొంది యువ బృందంతో సాగిపోతున్నారు. అయితే రాజమండ్రి రాజకీయాల్లో జోక్యం

కారణంగా ఎంపి భరత్ రామ్ తో సఖ్యత లేదన్న మైనస్ తప్ప రాజా పట్ల అధిష్టానం సానుకూలమే అన్నది తెలుస్తుంది. మరోపక్క యువకుడు కావడంతో భవిష్యత్తు ఉందన్న ఆలోచనతో జగన్ మరోసారి అంటూ రాజా కు నో చెప్పే అవకాశాలు లేకపోలేదని ప్రచారం ఉంది. దాడిశెట్టి రాజా రెండుసార్లు ఎమ్మెల్యే గా గెలుపొందగా జక్కంపూడి రాజా మాత్రం తొలిసారి ఎమ్మెల్యే కావడం వల్ల వచ్చేసారి అనే అవకాశాలే ఉన్నాయంటున్నారు. చూడాలి జగన్ కన్నబాబును కొనసాగిస్తారా? లేక మరొకరికి చోటు కల్పిస్తారా? అనేది.

# అంతర్మథనంలో శిద్దా

ఒంగోలు, ఆగస్టు 17, (న్యూస్ పల్స్)అవును? ఆ మాజీ మంత్రి గురించి రాజకీయ వర్గాల్లో జరుగుతున్న చర్చ ఇదే అంశంపై ఉండడం గమనార్హం. ఎవరైనా నాయకుడు పార్టీ మారితే.. దానివల్ల మరింత మెరుగైన పొలిటిక్స్ చేస్తారని అందరూ అనుకుంటారు. సహజంగా అదే జరుగుతుంది. అందులోనూ ప్రతిపక్ష పార్టీ నుంచి అధికారపక్షంలోకి వస్తే ఓ రేంజ్‌లో చక్రం తిప్పవచ్చు. ఇక గతంలో టీడీపీ నుంచి పార్టీ మారిన వైసీపీ నాయకులకు కూడా పదవులు దక్కాయి. నిధులు కూడా దక్కాయనే పేరుంది. అదేవిధంగా ఇటీవల టీడీపీ నుంచి వైసీపీలోకి వచ్చిన తోట త్రిమూర్తులు సహా పలువురికి మంచి పదవులు దక్కాయి. అయితే..మాజీ మంత్రి.. శిద్దా రాఘవరావు విషయంలో మాత్రం పరిస్థితి యూటర్న్ తీసుకుందనే వాదన వినిపిస్తోంది.టీడీపీ హయాంలో మంత్రిగా వ్యవహరించిన శిద్దా రాఘవరావు సర్కారులో బాగానే చక్రం తిప్పారు. ఐదేళ్లపాటు మంత్రి గా ఉన్నారు. అయితే.. గత ఎన్నికల సమయంలో ప్రకాశం జిల్లా దర్శి నుంచి కాకుండా.. చంద్రబాబు ఆదేశాల మేరకు ఆయన ఒంగోలు ఎంపీగా పోటీ చేసి పరాజయం పాలయ్యారు. అనంతరం ఆయన వ్యాపారాలపై వరుస ఎటాక్‌ల నేపథ్యంలో ఆయన కుమారుడు సుధీర్‌తో కలిసి వైసీపీ తీర్థం పుచ్చుకున్నారు. అయితే.. పార్టీ మారిన నాయకులు పుంజుకుంటారనే వాదన మన కు శిద్దా రాఘవ రావు.. విషయంలో కనిపించడం లేదు. కేవలం వ్యాపారాల కోసమే.. ఆయన పార్టీ మారారనే వాదన ఇప్పటికీ వినిపిస్తోంది.నిజానికి రాజకీయాల పరంగా చూసుకుంటే.. శిద్దా రాఘవరావు తోపాటు ఆయన తనయుడుకు కూడా మంచి ఫ్యూచర్ ఉండాల్సి ఉంది. అదే టీడీపీలో ఉండి ఉంటే పరిస్థితి మరోలా ఉండేది. కానీ, ఇప్పుడు వైసీపీలో ఉండడంతో రాజకీయంగా ప్రకాశం జిల్లాలో ఎక్కడా ఏ నియోజకవర్గంలోనూ శిద్దా రాఘవరావుకు కానీ, ఆయన కుమారుడికి కానీ.. అవకాశం ఇచ్చే ఛాన్స్ కనిపించడం లేదు. పోనీ..నామినేటెడ్ పదవులు అయినా ..దక్కుతాయా ? అంటే.. ఇప్పటికే చాలా మంది ఈ వరుసలోనూ ఉన్నారు.ప్రకాశం జిల్లాలోనే వైవి, గొట్టిపాటి భరత్, బూచేపల్లి శివప్రసాద్, తూమాటి మాధవరావు లాంటి నేతలు చాలా మందే ఉన్నారు. దీంతో శిద్దా రాఘవరావు తోపాటు ఆయన కుమారుడు కూడా రాజకీయంగా ఎక్కడా దూకుడు చూపించలేక పోవడం గమనార్హం. మరోవైపు.. సీనియర్ నాయకుడు, మాజీ మంత్రి అయిన శిద్దా రాఘవరావు సేవలను వినియోగించుకునేందుకు వైసీపీ నేతలు కూడా చొరవ చూపించడం లేదు. వెరసి.. శిద్దా రాజకీయంగా అడకత్తెరలో పడినట్టేనని అంటున్నారు పరిశీలకులు.

# శ్రీవారిని దర్శించుకున్న లోక్ సభ స్పీకర్ ఓమ్ ప్రకాష్ బిర్లా

తిరుమలఆగస్టు 17, (న్యూస్ పల్స్)తిరుమల శ్రీవారిని లోక్సభ స్పీకర్ ఓం ప్రకాష్ బిర్లా దర్శించుకున్నారు..ఇవాళ ఉదయం వి.ఐ.పి విరామ సమయంలో ఓంబిర్లా కుటుంబ సభ్యులతో పాటుగా టిటిడి ఛైర్మన్ వైవీ సుబ్బారెడ్డి, ఎంపీలు విజయసాయి రెడ్డి,మిధున్రెడ్డి,గురుమూర్తి, మార్గాని భరత్ లు స్వామి వారి సేవలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు.. వీరికి ఆలయ అధికారులు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేసారు.. దర్శనంతరం ఆలయ రంగనాయకుల మండపంలో వేద పండితులు వేద ఆశీర్వాదం చేయగా..ఆలయ అధికారులు పట్టు వస్త్రాలతో సత్కరించి స్వామి వారి తీర్ధ ప్రసాదాలు అందజేసారు.. అనంతరం ఆలయ వెలుపలకు వచ్చిన లోక్సభ స్పీకర్ ఓంబిర్లా మీడియాతో మాట్లాడుతూ... తిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామి వారిని కోట్ల హిందూవుల ఆరాధ్యదైవంగా కొలుస్తున్నారని,కుటుంబ సమేతంగా స్వామి వారి సేవలో పాల్గొని ఆశీస్సులు పోందడం చాలా సంతోషంగా ఉందన్నారు..దేశంలోని ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉండాలని,కరోనా నుండి ప్రజలకు త్వరలో విముక్తి కలిగించాలని స్వామి వారిని కోరుకున్నట్లు ఆయన తెలిపారు..స్వామి వారి ఆశీస్సులు దేశంపై మనపై ఉండాలని,దేశం మరింత అభివృద్ధి చేందాలని ప్రార్ధించినట్లు వెల్లడించారు.. తిరుమలలో భక్తులకు టిటిడి అన్ని సౌఖర్యాలు సంతృప్తిగా చేయడం ఆనందంగా ఉందని ఆయన కొనియాడారు..స్వామి వారి కృపతో దేశంకు నేను ఎటువంటి సేవ చేసేందుకైనా సిద్దంగా ఉన్నట్లు ఆయన తెలియజేసారు..

# తిరుమలలో ఎంపీ మార్గాని భరత్

తిరుమల ఆగస్టు 17, (న్యూస్ పల్స్)తిరుమల శ్రీవారిని రాజమండ్రి ఎంపి మార్గాని భరత్ దర్శించుకున్నారు..ఇవాళ ఉదయం వి.ఐ.పివిరామ సమయంలో లోక్సభ స్పీకర్ ఓం బిర్లాతో కలిసి స్వామి వారి సేవలో పాల్గోన్నారు.. దర్శనంతరం ఆలయ వెలుపలకు వచ్చిన ఆయన మీడియాతో మాట్లాడుతూ..లోక్ సభస్పీకర్ ఓం బిర్లా, టీటీడీ ఛైర్మన్,ఎపి ఎంపీలు విజయ సాయి రెడ్డి,మిదున్ రెడ్డి,గురుమూర్తి తో కలిసి శ్రీవారిని దర్శించుకోవడం చాలా ఆనందంగా ఉందన్నారు..నాడు నేడు కార్యక్రమాన్ని నిన్న సీఎం జగన్మోహన్ రెడ్డి ప్రాంభించారని,ఇందులో భాగంగా 15 వేల 900 స్కూళ్లను సర్వాంగసుందరంగా తీర్చి దిద్దడం జరిగిందని, జగనన్న విద్యా దీవెనలో భాగంగా పిల్లల కోసం ప్రత్యేక పథకాలు రూపొందించడం చాలా సంతోషంగా ఉందని ఆయన తెలియజేసారు..విద్యా,వైద్యంలో ఆంధ్రప్రదేశ్ అగ్రగామిగా నిలుస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేసారు..ఓబీసీ బిల్లుపై మేము మాట్లాడటం జరిగిందని,లోకల్ బాడీలో, నామినేటెడ్ పదవుల్లో మహిళకు 50 శాతం రిజర్వేషన్ కల్పించిన ఘనత జగన్ దిని ఆయన స్పష్టం చేసారు..అన్ని రంగాల్లో ఎపి అభివృద్ధి చెందేలా భగవంతుడు ఆశీర్వదించాలని వేడుకుంటున్నట్లు ఆయన వివరించారు..

# స్టీల్ ప్లాంట్ కోసం కార్మిక సంఘాల నిరసన

విశాఖపట్నం ఆగస్టు 17, (న్యూస్ పల్స్)విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ నిర్ణయాన్ని నిరసిస్తూ విశాఖ స్టీల్ ప్లాంట్ వద్ద మరో సారి కార్మిక సంఘాలు నిరసన వ్యక్తం చేశారు. స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని.. విశాఖ ఉక్కును కాపాడాలని డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వా నికి వ్యతిరేకంగా నినాదాలతో హోరె త్తించారు.ఉక్కు ప్రైవేటీకరణ నిర్ణయం చాలా బాధాకరమన్నారు కార్మిక సంఘాల నేత అయోధ్య రామయ్య. ఈ నిర్ణయంతో దాదాపు 32వేల మంది ఉద్యోగులు, వారి కుటుంబాలు ఇబ్బందులు పడతాయని చెప్పారు. కార్మికులు, ప్రజల సంపద విశాఖ ఉక్కు అని.. దాన్ని ప్రైవేటీకరణ చేస్తామంటే ఊరుకునేది లేదన్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణకు పూర్తి వ్యతిరేకమని చెప్పారు.

# అంబేద్కర్ జన్మస్థల యాత్రకు రాష్ట్ర ప్రభుత్వం సహకరించాలి

**- ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం**

పెద్దపల్లి ఆగస్ట్ 17మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని ఇండోర్ జిల్లా మౌ. పట్టణములోనీ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జన్మస్థలం యాత్రకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చొరవ తీసుకొని సహకరించాలని ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు బొంకూరి మధు తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రశేఖర రావుకి విజ్ఞప్తి చేశారు. నవభారత రాజ్యాంగ నిర్మాత బాబాసాహెబ్ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ రెండు సంవత్సరాల 11 నెలల 18 రోజులు ఒక్కరే శ్రమించి ప్రపంచములోనే అతి పెద్ద లిఖిత పూర్వక రాజ్యాంగాన్ని అందించిన గొప్ప మహోన్నతుడన్నారు. భారతదేశ ప్రజల శ్రేయస్సు కాంక్షించి తన కుటుంబాన్ని దేశం కోసం త్యాగం చేసిన త్యాగధనుడు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ అన్నారు.అలాంటి రాజ్యాంగ రూపకర్తను అందించిన మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని ఇండోర్ జిల్లా మౌ. యాత్రా స్థలంగా కొనసాగుతుందని, తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర రావు, రాష్ట్ర సంక్షేమ శాఖ మాత్యులు కొప్పుల ఈశ్వర్ చొరవ తీసుకుని తెలంగాణ రాష్ట్రంలోని 33 జిల్లాలకు సంబంధించిన దళిత బహుజనులను దశలవారీగా రాష్ట్ర ప్రభుత్వం ఖర్చులతో మౌ. యాత్రకు పంపించాలని విజ్ఞప్తి చేశారు.

# బంగారం... మరింత తగ్గుతుందా



ముంబై, ఆగస్టు 17, (న్యూస్ పల్స్)గోల్డ్ ధరలు నాలుగు నెలల కనిష్టాలకు పడిపోయాయి. బంగారం రేట్లు పడిన ప్రతీసారి ఇన్వెస్ట్ చేయడానికి ఇది సరియైన టైమా? అని ఆలోచనలో పడతారు ఇన్వెస్టర్లు. లాంగ్ టెర్మ్ కోసం చూసుకుంటే గోల్డ్ ను కొనుక్కోవడం బెటర్ అని ఎనలిస్టులు సలహాయిస్తున్నారు. కానీ, షార్ట్ టెర్మ్ కోసం చూసుకుంటే మాత్రం గోల్డ్ రేట్లు ఇప్పటిలో పెరిగే అవకాశాలు కనిపించడం లేదంటున్నారు. ఇంటర్నేషనల్‌గా, డొమెస్టిక్‌గా చూసుకుంటే గోల్డ్ అవుట్ లుక్ బేరిష్‌గా ఉందని విశ్లేషిస్తున్నారు. ప్రస్తుతం పది గ్రాముల గోల్డ్ రేటు హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో రూ. 48 వేల వద్ద ట్రేడవుతోంది. ఎంసీఎక్స్‌లో గోల్డ్ అక్టోబర్ ఫ్యూచర్స్ రూ. 46,930 వద్ద క్లోజయ్యింది. ఇంటర్నేషనల్ మార్కెట్‌లో ఔన్సు గోల్డ్ 1,781.55 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. కిందటి వారంలో యూఎస్ జాబ్స్ డేటా మెరుగ్గా ఉండడంతో గోల్డ్ ధరలు భారీగా క్రాష్ అవ్వడం చూశాం. మేజర్ కరెన్సీలతో పోలిస్తే డాలర్ బలపడడం కూడా బంగారం రేట్లు పడడానికి కారణమయ్యింది. ఈ నెల 9 న గోల్డ్ ఔన్సు ధర 1,720 డాలర్లకు పతనమయ్యింది. కానీ, తాజాగా గోల్డ్ రేట్లు తిరిగి రీబౌండ్ అవుతున్నాయి. కరోనా డెల్టా వేరియంట్ విస్తరిస్తుండడంతో గోల్డ్ రేట్లు తిరిగి పెరుగుతున్నాయి. కానీ, ఈ ట్రెండ్ ఇలానే కొనసాగుతుందా? గోల్డ్ మరింత పెరుగుతుందని ఎనలిస్టులు అనుకోవడం లేదు. దీనికి కొన్ని కారణాలు కూడా చెబుతున్నారు. గోల్డ్ అవుట్ లుక్ నెగెటివ్‌గానే ఉందని బ్రోకరేజి కంపెనీ జియోజిత్ ఫైనాన్షియల్ సర్వీసెస్ పేర్కొంది. గ్లోబల్‌గా ఔన్సు గోల్డ్ రేటు 1,815 డాలర్లకు దిగువన ట్రేడయ్యేంత వరకు గోల్డ్ అవుట్ లుక్ బేరిష్‌గానే ఉంటుందని తెలిపింది. 1, 680 డాలర్లకు పడిపోతే కొనుగోళ్లు పెరగొచ్చని అంచనావేసింది. యూఎస్ ఇన్‌ఫ్లేషన్ పెరుగుతోంది. దీన్ని కట్టడి చేసేందుకు ఫెడ్ వడ్డీ రేట్లను పెంచే అవకాశం ఉందని ఎనలిస్టులు చెబుతున్నారు. ఈ నిర్ణయం డాలర్ బలపడడానికి కారణమవుతుందని, గోల్డ్ రేట్లు పడతాయని అభిప్రాయపడుతున్నారు. ఇండియన్ మార్కెట్‌లో కూడా 10 గ్రాముల గోల్డ్ రేటు నాలుగు నెలల కనిష్టానికి తగ్గి రూ. 45,800 ను తాకడాన్ని చూశాం. గోల్డ్ రేట్లను ఎక్కువగా ప్రభావితం చేసేది ఇంటర్నేషనల్ అంశాలే. ముఖ్యంగా యూఎస్ ఎకనామిక్ డేటా మెరుగ్గా ఉండడం గోల్డ్‌పై నెగెటివ్ ప్రభావాన్ని చూపుతోంది. ట్రెజరీ ఈల్డ్స్ పడినప్పుడు గోల్డ్ కొనుగోళ్ల వైపు ఇన్వెస్టర్లు చూస్తారు. కానీ, నెల రోజుల నుంచి ఈల్డ్స్ తగ్గుతున్నా, గోల్డ్ రేట్లు పెరగలేదు. గోల్డ్‌పై ఇన్వెస్టర్లు నెగెటివ్ సెంటిమెంట్‌తో ఉన్నారనే విషయం అర్థమవుతోందని ఎనలిస్టులు చెబుతున్నారు. ఈ మెటల్ ధరలు కీలక స్థాయిలను చేరుకోలేకపోతే, మరింత పడుతుందని అంచనావేస్తున్నారు. కాగా, బాండ్లపై వచ్చే రిటర్న్‌ను బాండ్ ఈల్డ్ అంటారు. గోల్డ్ రేట్లు గతేడాది పెరగడంలో గోల్డ్ ఎక్స్ఛేంజ్ ట్రేడెడ్ ఫండ్స్ (ఈటీఎఫ్) లు కీలకంగా ఉన్నాయి. వ్యాక్సినేషన్ ప్రాసెస్ వేగంగా జరుగుతుండడం, పశ్చిమ దేశాలు అనుకున్నదానికంటే వేగంగా కరోనా నుంచి రికవరీ అవ్వడం గోల్డ్‌పై నెగెటివ్ ప్రభావాన్ని చూపుతోంది. దీంతో చిన్న ఇన్వెస్టర్ల నుంచి పెద్ద పెద్ద పెన్షన్ ఫండ్స్ వరకు గోల్డ్ ఈటీఎఫ్‌లలో తమ హోల్డింగ్స్‌ను తగ్గించుకుంటున్నాయి. ముఖ్యంగా ఈ ఏడాది జూన్ క్వార్టర్‌లో గోల్డ్ ఈటీఎఫ్‌లలో ఇన్వెస్ట్‌మెంట్లు తగ్గాయి. ఇండియా వంటి దేశాల్లో గోల్డ్ వాడకం ఎక్కువ. కానీ, మన దగ్గర కూడా ఈ ఏడాది గోల్డ్ డిమాండ్ తగ్గింది. దీంతో ఇంపోర్ట్స్ పడిపోయాయి. ఇది గోల్డ్ ధరలు తగ్గడానికి కారణమవుతోంది. గోల్డ్ ఇన్వెస్టర్లకు మంచి లాభాలనే తెచ్చిపెట్టింది. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత నుంచి ఇప్పటి వరకు గోల్డ్ రేట్లు 54,000 శాతం పెరిగాయి. పది గ్రాముల గోల్డ్ రేటు 1947 లో రూ. 88.62 గా ఉంది. ఆదివారం నాటికి హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో ఈ రేటు రూ. 48 వేలకు చేరుకుంది. ఈక్విటీ, బాండ్ వంటి ఇన్వెస్ట్‌మెంట్లు రిస్క్‌గా మారినప్పుడు గోల్డ్ వైపు ఇన్వెస్టర్లు చూస్తుంటారు. ముఖ్యంగా గ్లోబల్ ఫైనాన్షియల్ క్రైసిస్ (ఆర్థిక మాంద్యం) ?2008 తర్వాత నుంచి గోల్డ్ ధరలు ఎక్కువగా పెరిగాయి. 2008 లో 10 గ్రాముల గోల్డ్ రూ. 12,500 గా ఉంది. ఇండియన్స్‌కు ఇష్టమైన ఇన్వెస్ట్‌మెంట్ అసెట్‌గా గోల్డ్ నిలుస్తూ వస్తోందని ఐఐఎఫ్ఎల్ సెక్యూరిటీస్ ఎనలిస్ట్ అనుజ్ గుప్తా అన్నారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి గోల్డ్ కొనడం పెరుగుతూ వచ్చిందన్నారు.

# ఋణమాఫీ ట్రయిల్ రన్ సక్సెస్

విజయవాడ, ఆగస్టు 17, (న్యూస్ పల్స్)రుణమాఫీ ట్రయల్ రన్ విజయవంతమైంది. రూ.25 వేల నుండి రూ.25,100 వరకు రుణాలున్న వారి ఖాతాలకు ట్రయల్ రన్ నిర్వహించారు. తొలిరోజు 1309 మంది రైతుల ఖాతాలకు రుణమాఫీ నిధుల బదిలీ చేశారు. ఈ నెల 30 వరకు ప్రక్రియ కొనసాగనుంది. రూ.50 వేల రూపాయల లోపు గల రైతుల రుణాలన్నీ మాఫీ చేయనుంది ప్రభుత్వం. రైతుబంధు నిధుల పంపిణీ మాదిరిగానే రుణమాఫీ నిధులు కూడా జమ అవుతాయి. 25వేలు, 26వేలు, 27వేలు స్లాబుల వారీగా రుణమాఫీ మొత్తం రైతుల ఖాతాల్లో జమ అవుతుందని వ్యవసాయశాఖ మంత్రి నిరంజన్ రెడ్డి పేర్కొన్నారు. రెండో విడుత రుణమాఫీలో 6,06,811 మంది రైతులకు లబ్ధి చేకూరనుందని ఆయన చెప్పారు. నెలాఖరు వరకు 2005 కోట్లా 85 లక్షల రూపాయలు రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ అవుతాయని చెప్పారు. సోమవారం నుంచి రుణమాఫీ మొదలయిన నేపథ్యంలో రైతు లోకానికి మంత్రి శుభాకాంక్షలు తెలిపారు. సీఎం కేసీఆర్ నేతృత్వంలో 2014 నుంచి 18 వరకు 16,144 కోట్ల రైతు రుణాలు మాఫీ అయ్యాయని అన్నారు. 2018లో 25 వేలలోపు రుణాలున్న 2.96 లక్షల మంది రైతులకు 408.38 కోట్ల మేర మాఫీ అయిందని వెల్లడించారు. ముఖ్యమంత్రి కేసీఆర్?కు రాష్ట్ర రైతుల పక్షాన థ్యాంక్స్ చెప్పిన నిరంజన్ రెడ్డి? సమైక్య పాలనలో నిర్లక్ష్యానికి గురైన వ్యవసాయ రంగానికి కేసీఆర్ వెన్నుదన్నుగా నిలచారని అన్నారు. ఆకలితో అలమటించిన తెలంగాణను దేశానికే అన్నపూర్ణగా నిలిపారని మంత్రి పేర్కొన్నారు. పంటల మార్పిడి వైపు రైతులను ప్రోత్సహించి తెలంగాణ వ్యవసాయాన్ని దేశానికే ఆదర్శంగా నిలిపేందుకు కృషి చేస్తామని వెల్లడించారు.రైతుల ఖాతాలలో జమయిన నిధులను బ్యాంకర్లు ఇతర పద్దుల కింద జమ చేసుకోవద్దని ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. రుణాలు మాఫీ అయిన రైతులకు బ్యాంకులు కొత్త రుణాలు అందజేయాలని సూచించింది

# కరోనా భయాల మధ్య మొదలైన విద్యాసంస్థలు

విజయవాడ,ఆగస్ట్17 ప్రభుత్వ ఆదేశాల మేరకు సోమవారం నుంచి ప్రభుత్వ పాఠశాలలు పునః ప్రారంభమయ్యాయి. విద్యార్థులు,టీచర్లు తొలిరోజు బిక్కుబిక్కుమంటూ పాఠశాలలకు చేరుకున్నారు. అయితే ఎవరికి వారు మాస్కులు ధరించి, శానిటైజ్ చేసుకుని రావడం గమనార్హం. దాదాపుగా రాష్ట్రంలోని అన్ని పాఠశాలలు తెరుచుకున్నాయి. ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో కొవిడ్ నిబంధనలకు అనుగుణంగా ఏర్పాట్లుచేశారు. పాఠశాలకు వచ్చిన ప్రతి విద్యార్థిని థర్మల్ పరీక్ష చేసిన తర్వాత పాఠశాల లోకి అనుమతించారు. అటుపై భౌతిక దూరం పాటిస్తూ ఒక బెంచ్‌పై ఒక విద్యార్థిని చొప్పున కూర్చోబెట్టారు. కరోనాతో అప్రమత్తం ఉండాలని విద్యార్థులకు అవగాహన కలిగించారు. ఆయా ప్రాంతాల్లో ఎమ్మెల్యేలు, మంత్రులు పాఠశాల ప్రారంభోత్సవాలను నిర్వహించి అవగాహన కల్పించారు. ఇలా జిల్లాల్లో ప్రభుత్వ, ఎయిడెడ్ యాజమాన్యాల పరిధిలోని అన్ని పాఠశాలలు సోమవారం పునఃప్రారంభం అయ్యాయి. తొలిరోజు 20 నుంచి 50 శాతం మంది విద్యార్థులు హాజరయ్యారు. కరోనా నేపథ్యంలో విద్యార్థులు, సిబ్బంది వైరస్ బారిన పడకుండా ఉండేలా విద్యాశాఖ జాగ్రత్తలు చేపట్టింది. తొలిరోజు పిల్లలకు తల్లిదండ్రుల అంగీకార పత్రాలు అందజేశారు. సిబ్బంది, విద్యార్థులు విధిగా మాస్కులు ధరించేలా చర్యలు చేపట్టారు. పాఠశాలలు గతంలో నిర్దేశిరచిన సమయాల్లోనే కొనసాగిస్తారు. ఉపాధ్యాయులు, సిబ్బంది ప్రతిరోజు పాఠశాలకు హాజరయ్యేలా విద్యాశాఖ ఆదేశాలు జారీ చేసింది. పిల్లల సంఖ్యకు అనుగుణంగావసతి లేని పక్షంలో తరగతులు రోజు మార్చి రోజు నిర్వహించేలా ప్రణాళికలు రూపొందించారు. స్కూలుకు వచ్చేటప్పుడు, వెళ్లేటప్పుడు భౌతిక దూరం ఉండేలా విద్యార్థులకు అవగాహన కల్పించారు. పాఠశాలలో కూడా కొవిడ్ జాగ్రత్తలపై ఒక పీరియడ్‌లో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నట్లు ఉపాధ్యాయులు చెబుతున్నారు. పాఠశాలలో అసెంబ్లీ, క్రీడలు వంటివి పూర్తిగా రద్దు చేశారు. అయితే తొలిరోజు కావడంతో విద్యార్థులు భయంభయంగా ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. కొన్నిచోట్ల పాఠశాల ప్రాంగణంలోనే కొవిడ్ వ్యాక్సిన్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. దీంతో వ్యాక్సిన వేయించుకోవడానికి ప్రజలు అధిక సంఖ్యలో హాజరవు తున్నారు. విద్యకు పేదరికం అడ్డుకాకూడదన్నదే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి ఆదిమూలపు సురేశ్ పేర్కొన్నారు. పేద విద్యార్థుల చదువులు తల్లిదండ్రులకు ఏమాత్రం భారం కాకూడదనే ఉద్దేశంతో అమ్మఒడి, జగనన్న విద్యాదీవెన, జగనన్న గోరుముద్ద, జగనన్న వసతి దీవెన, జగనన్న విద్యాకానుక వంటి పథకాలను సీఎం వైఎస్ జగన ప్రవేశపెట్టారన్నారు. రాష్ట్రంలోని పేద విద్యార్థుల పాలిట మేనమామగా ముఖ్యమంత్రి నిలిచారన్నారు. నాడు-నేడు కార్యక్రమం ద్వారా రాష్ట్రంలో అన్ని ప్రభుత్వ పాఠశాలలు, వాటి అనుబంధ వసతి గృహాలను అధునాతన వసతులతో తీర్చిదిద్దడం జరిగిందన్నారు. ఒకవైపు కరోనా భయపెడుతున్నా ప్రభుత్వం

**తొలిరోజు భయంభయంగానే హాజరైన టీచర్లు,స్టూడెంట్స్**

**భౌతికదూరం, మాస్కుల నిబంధనలు పాటించిన పిల్లలు**

పాఠశాలలు తెరవాలని ఆదేశాలు జారీ చేయడంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఒకింత ఆందోళనలో ఉన్నారు. తమ పిల్లలను బడికి పంపాలా వద్దా అని కొట్టుమిట్టాడుతున్నారు. ప్రభుత్వ నిర్ణయాన్ని ఉపాధ్యాయులు వ్యతిరేకించినా టీచర్లకు పూర్తి స్థాయిలో వ్యాక్సిన వేయలేదని, అది పిల్లలపై ప్రభావం చూపుతుందనే వాదనలు వినిపిస్తున్నాయి. ప్రస్తుత పరిస్థితుల్లో థర్డ్‌వేవ్ ప్రారంభం కానున్న నేపథ్యంలో దాని ప్రభావం చిన్నారులపై పడే ప్రమాదం ఎక్కువగా ఉందని వైద్యనిపుణులు చెబుతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో పాఠశాలలు ప్రారంభించాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీనిపై తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. పాఠశాలలు ప్రారంభించాలని ప్రభుత్వం నిర్ణయించడంతో పాటు కొన్ని కొవిడ్ నిబంధనలు జారీ చేసింది. పది శాతం కంటే తక్కువ పాజిటివ్ రేటు ఉన్న ప్రాంతాల్లో అన్ని పాఠశాలలు తెరవాలి. ప్రతి తరగతిలో 20 మంది విద్యార్థుల కంటే ఎక్కువ ఉండకూడదు. 20 మంది కంటే విద్యార్థులు తక్కువ ఉంటే ఒకరోజు అన్ని తరగతులు నిర్వహించాలి. అధికంగా ఉంటే 6, 7 తరగతులు ఒకరోజు, 8, 9, 10 తరగతులు మరుసటి రోజు నిర్వహించాలి. భౌతిక దూరం పాటించాలి. పెన్నులు, ప్లేట్లు, పుస్తకాలు తదితర వస్తువుల మార్పిడి చేయకూడదు. విద్యార్థులు ఇంటికి వెళ్లిన వెంటనే స్నానం చేయించాలని వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. పాఠశాలల్లో మరుగుదొడ్లు ఎప్పటికప్పుడు శుభ్రం చేస్తుండాలి. క్రీడలు, స్కూలు అసెంబ్లీ తదితర వంటివి నిర్వహించకూడదు. వీటితో పాటు కరోనా కట్టడికి మరికొన్ని సూచనలు ప్రభుత్వం ప్రకటించింది.

# ఇరుకుటుంబాల మధ్య భూ తగాదా

**ఘర్షణలో పలువురికి తీవ్ర గాయాలు**

రాజమండ్రి,ఆగస్ట్17(): తూర్పుగోదావరి జిల్లా మామిడికుదురు మండలం, మొగలికుదురు అరుంధతి పేటలో దారుణం జరిగింది. భూమి సరిహద్దు తగాదాల నేపథ్యంలో ఒకే సామాజిక వర్గానికి చెందిన ఇరు కుటుంబాల మధ్య ఘర్షణ జరిగింది. కత్తులు, కర్రలతో పరస్పరం దాడి చేసుకున్నారు. ఈ ఘటనలో ఇద్దరు పరిస్థితి విషమంగా ఉండడంతో వారిని కాకినాడ జీజీహెచ్‌కు తరలించారు. మరో నలుగురికి స్వల్ప గాయాలయ్యాయి. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# బీటెక్ విద్యార్థిని దారుణ హత్య అమానుషం

**దశ దిశ లేని దిశ యాప్ మహిళలకు రక్షణ కలిగించేనా?**

**బిజెపి మహిళా నేత కందికట్ల రాజేశ్వరి**

నెల్లూరు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం మహిళల రక్షణ కొరకు నూతనంగా ప్రారంభించబడిన దిశ యాప్ ప్రారంభ ఆరంభ దశలోనే గుంటూరు పట్టణ నడిబొడ్డున బీటెక్ విద్యార్థిని, దళిత యువతి దారుణంగా హత్య కావాడిందని, ఇది ప్రభుత్వ అ నిర్లక్ష్య చర్యలకు కారణమేనని నెల్లూరు జిల్లా భారతీయ జనతా పార్టీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు కందికట్ల రాజేశ్వరి పేర్కొన్నారు. ఈ దారుణం స్వాతంత్ర దినోత్సవం నాడు జరగడం ప్రభుత్వానికి సిగ్గుచేటన్నారు. మహిళల రక్షణ కోసం ప్రత్యేకంగా దిశ యాప్ ఏర్పాటు చేయబడింది అని రాష్ట్ర ప్రభుత్వం గొప్పలు చెప్పుకోవడం తప్ప, దిశ యాప్కు దశ లేదన్నారు. రాష్ట్రమంతా స్వాతంత్ర వేడుకలు జరుపుకుంటున్న నేపథ్యంలో దిశ యాప్ చట్టానికి దశే లేదని చెప్పు కు నిదర్శనంగా గుంటూరులో ఈ దారుణ హత్య ఉందన్నారు. రమ్య శ్రీ ని పట్టపగలే నడిరోడ్డుపై విచక్షణారహితంగా నరికి చంపిన నిధులు శశి కృష్ణ ప్రభుత్వం కఠిన చర్యలు చేపట్టకపోవడం ఏంటని ప్రశ్నించారు. దారుణ హత్య పై ప్రభుత్వ స్పందన చూసినట్లయితే రాష్ట్రంలో దళితుల పై ఉన్న ప్రేమ ఏంటో స్పష్టంగా తెలుస్తుంది అన్నారు. ఇటువంటి మారణకాండలు మళ్లీ పునరావృతం కాకుండా ఉండాలంటే నిందితుడు శశి ఫాస్ట్ ట్రాక్ కోర్టు ఏర్పాటు చేసి చట్టరీత్యా కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఇటువంటి నేపథ్యాలను పరిశీలించిన పిదప తల్లిదండ్రులు కూడా వారి వారి ఆడపిల్లలపై ప్రత్యేక దృష్టి సారించాల్సి ఉందన్నారు. ఆడపిల్లల యోగక్షేమాలు పై తల్లిదండ్రులు ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ, వారి ప్రవర్తన పై దృష్టిపెట్టి తమ పిల్లలను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి తల్లిదండ్రుల పై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో గంటా విజయశ్రీ ,కరణం సుభాషిణి తదితరులు పాల్గొన్నారు.

# పీసీసీ చీఫ్ గా నల్లారి కిరణ్ కుమార్ రెడ్డి?

### ఆంధ్ర ప్రదేశ్ రాజకీయాల్లో కీలకపరిణామాలు

విజయవాడ ఆగస్టు 17, ( విభారె) ఆంధ్రప్రదేశ్ పీసీసీ చీఫ్ గా ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి సీనియర్ రాజకీయ నాయకుడు నల్లారి కిరణ్ కుమార్ రెడ్డిని నియమించే అవకాశాలున్నట్లు తెలుస్తుంది. తాజాగా మారుతున్న పరిణామాల నేపద్యం లో ఆయన పేరును పార్టీ అగ్రనేత.. రాహుల్ గాంధీ పరిశీలనకు తీసు కున్నట్లు వినికిడి. ఇటీవల ఏపీకి చెందిన కీలక నేతలతో రాహుల్ గాంధీ సమావేశమయ్యారు. ఈ సమావేశంలోనే అకస్మాత్తుగా.. కిరణ్ పేరు ప్రస్తావనకు వచ్చింది. ఆయన గురించి కొద్దిసేపు రాహుల్ గాంధీ సదరు నేతలతో విస్తృతంగా చర్చించారట. దీంతో రాష్ట్ర కాంగ్రెస్ లో కీలకపరిణామాలు చోటు చేసుకునే అవకాశం ఉందనే చర్చ జోరుగా సాగుతోంది. పార్టీలో ఇటీవల పరిణామాలను కూడా రాహుల్.. సీనియర్లతో చర్చించినట్టు తెలుస్తోంది. విషయంలోకి వెళ్తే.. ఇటీవల రాహుల్ గాంధీ ఏపీకి చెందిన నేతలతో విడివిడిగా సమావేశం అయ్యారు. ముఖ్యమైన నాయకులను ఢిల్లీ పిలిపించుకుని మరీ.. ఆయన ఏపీ పరిణామాలు ఏపీలో పార్టీ పరిస్థితిపైనా చర్చించినట్టు తెలిసింది. వీరిలో పార్టీ పీసీసీ ప్రెసిడెంట్ శైలజానాథ్తోపాటు.. చాలా మంది నాయకులు ఉన్నారని సమాచారం.ప్రస్తుతం ఏపీలో కాంగ్రెస్ పరిస్థితి 2014లో ఎలా ఉందో అలానే ఉందనేది వాస్తవం. రాష్ట్ర విభజన తర్వా త.. పార్టీ పూర్తిగా దెబ్బతింది. ఇద్దరు పార్టీ చీఫ్ ను మార్చినా.. పార్టీ పుంజుకోలేదు. ముఖ్యంగా పార్టీకి బల మైన రెడ్డి సామాజిక వర్గాన్ని ఎవరూ ఓన్ చేసుకోలేక పోయారు. ఈ క్రమంలోనే పార్టీ చీఫ్ను మార్చాలనే నిర్ణయానికి వచ్చినట్టు తెలుస్తోంది. అయితే.. దీనికి సాకే తరఫున వాదన కూడా బలంగా వినిపిస్తోంది. తనకు సీనియర్లు ఎవరూ సహకరించడం లేదని.. తాను చీఫ్గా ఉండి ప్రయోజనం ఏంటని ఆయన ప్రశ్నిస్తున్నట్టు సమాచారం. ఈ క్రమంలోనే రాజీనామాకు రెడీ అయ్యారని కాంగ్రెస్లో చర్చ సాగుతోంది. మరీ ముఖ్యంగా సీనియర్ నేతలు కేంద్ర మాజీ మంత్రులు.. జేడీ శీలం ఎం.ఎం. పళ్లంరాజు మెగాస్టార్ చిరంజీవి వంటివారు.. యాక్టివ్గా లేకపోవడాన్ని ఈ సందర్భంగాసాకే రాహుల్కు వివరించినట్టు సమాచారం. జాతీయ నేతలు వచ్చినప్పుడు మాత్రమే వారు కనిపిస్తున్నాయని లేకపోతే.. ఇంటికే పరిమితం అవుతున్నారని.. కనీసం .. స్పందించడం లేదని సాకే వివరించినట్టు తెలిసింది. ఈ పరిణామాలు ఇలానే ఉంటే.. పార్టీ కోలుకోవడం కష్టమనే వాదనను ఆయన తెరమీదికి తీసుకువచ్చినట్టు తెలిసింది.అయితే అనూహ్యంగా ఆయా అంశాలపై.. చర్చించి.. పరిష్కారం చూపించాల్సిన రాహుల్ గాంధీ.. మాజీ ముఖ్యమంత్రి కిరణ్ పేరు ను ప్రస్తావించారట. కిరణ్కుమార్ను పీసీసీ చీఫ్ చేయడంపై ఆయన సీనియర్ల ను సలహా కోరినట్టు సమాచారం. దీనికి సీనియర్లు కూడా సరే అన్నారని.. ఆయన వస్తే.. రెడ్డి సామాజిక వర్గం.. పార్టీవైపు మొగ్గు చూపుతుందని.. చెప్పినట్టు తెలిసింది.

# కొలిక్కిరాని వివేకా హత్యకేసు

### సిబిఐ దర్యాప్తులోనూ కానరాని ఆశ
### హంతకుల నుంచి డాక్టర్ సునీతకు ప్రాణహాని ఉందా?
### ఎస్పీకి ఫిర్యాదు చేయడంపై సర్వత్రా అనుమానాలు

కడప,ఆగస్ట్17(: రెండేళ్ల క్రితం హత్యకు గురైన వైఎస్ వివేకానంద రెడ్డి కేసు ఇంకా ఓ కొలిక్కి రావడంలేదు. సిబిఐ దర్యాప్తునకు దొరకనంతగా ఆయనను మర్డర్ చేశారని అర్థం అవుతోంది. ఇప్పటికీ సరైన ఆధారం సిబిఐ సేకరించలేదు. చంద్రబాబు సిఎంగా ఉన్నప్పుడు పదేపదే విచారకు డిమాండ్ చేసి నిగ్గు తేల్చాలన్న వైసిపి ..ఇప్పుడు అధికారంలోకి వచ్చి రెండేళు దాటినా ఎటూ తేల్చలేదు. సొంత బాబాయ్ మర్డర్ కేసు విషయంలో జగన్ ఎందుకనో పట్టించుకోవడం లేదన్న విమర్శలు ఉన్నాయి. ఇక్కడ మరో ఆశ్చర్యకరమైన విషయం ఏమంటే.. వివేకా కుమార్తె డాక్టర్ సునీత తన కుటుంబానికి ప్రాణహాని ఉందని కడప జిల్లా ఎస్పీకి అర్జీ పెట్టుకోవడం సంచలనమైంది. వివేకానందరెడ్డి హత్య కేసులో ప్రధాన సూత్రధారుల నుంచే తనకు ప్రాణహాని ఉందని ఆమె ఆందోళన వ్యక్తంచేశారు. వరుసకు సోదరుడైన జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పటికీ డాక్టర్ సునీత ఆయనను ఆశ్రయించకుండా నేరుగా ఎస్పీకి లేఖ రాయడం చర్చనీయాంశంగా మారింది. తన తండ్రిని హత్య చేసిన వారిని శిక్షించాలని డాక్టర్ సునీత రెండేళ్లుగా పోరాటం చేస్తున్నారు. తన ఈ పోరాటంలో వైఎస్ కుటుంబీకులతో పాటు వైఎస్ షర్మిల కూడా తనకు అండగా ఉన్నారని ఆమె చెబుతున్నారు. భద్రత కోసం సిఎం జగన్ను అభ్యర్థించక పోవడం అనుమా నాలకు తావిస్తోంది. వివేకా హంతకులకు డాక్టర్ సునీత కూడా టార్గెట్గా ఉందా అన్న అనుమానాలు వస్తున్నాయి. డాక్టర్ సునీత తనను కలసి భద్రత కోరకపోయినప్పటికీ ఆమెకు రక్షణ కల్పించవలసిన బాధ్యత సిఎంగా జగన్ పైనే ఉంటుంది. ఆమెకు ఏమి జరిగినా ఆ పాపం జగన్ చేతులకు అంటుకుంటుంది. డాక్టర్ సునీత తాజా అర్జీ తర్వాత వివేకానంద రెడ్డి హంతకులకు ముఖ్యమంత్రి జగన్ రెడ్డి ఆశిస్సులు ఉన్నాయా అన్నచర్చ కూడా ప్రజల్లో రావడం గమనించాలి. అయితే సిఎం జగన్ కూడా ఈ కేసు త్వరగా తేల్చాలన్న భావనలోనే ఉంటారు. సొంత బాబాయ్ కనుక ఎక్కువగా శ్రద్ధ పెడితే రాజకీయంగా అదీ చెడ్డపేరు వస్తుందన్న భావనలో ఉండివుంటారు. సొంత సోదరి షర్మిల తెలంగాణలో పార్టీ పెట్టడం కూడా జగన్కు తలనొప్పిగా మారిందన్న భావన ఉంది. అలాగే సొంత బాబాయి కుమార్తె డాక్టర్ సునీత ఎస్పీకి ఫిర్యాదు చేయడం, గతంలో ఢిల్లీలో కూడా మీడిఆముందు ఆవేదన చెందడం కూడా సిఎం జగన్కు చీకాకు కల్పించే విషయాలే. సిబిఐ దర్యాప్తు త్వరగా ముగించి హంతకులను తేల్చితే తప్ప వివేకానంద రెడ్డి హత్య కేసు మిస్టరీ వీడదు.

# తెలుగు యువత సెంట్రల్ నియోజకవర్గ అధ్యక్షుడిగా బూదాల సురేష్

విజయవాడ ఆగస్టు 17, ( విభారె) సెంట్రల్ నియోజకవర్గ తెలుగుయువత అధ్యక్షులుగా ప్రయాగ కృష్ణ, ప్రధాన కార్యదర్శిగా బూదాల సురేష్ లను నియమిస్తూ టీడీపీ పొలిట్బ్యూరో సభ్యులు, ఇలీ.ఓశ్రీజీ బోండా ఉ మామహేశ్వరరావు వారికి నియామకపత్రాలు అందించడం జరిగింది. ఈ సందర్భంగా బోండా ఉమా మాట్లాడుతూ పని చేసే కార్యకర్తలను తెలుగుదేశంపార్టీ ఎల్లప్పుడూ గుర్తిస్తుందని, యువనాయకత్వాన్ని ప్రోత్సహిస్తూ నేడు ప్రయాగ కృష్ణ,బూదాల సురేష్ లను నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్ష, ప్రధాన కార్యదర్సులుగా నియమించడం జరిగింది అన్నారు.. ఈ సందర్భంగా మరింత ఉత్సాహంతో పనిచేయాలని అధికార పార్టీ చేసే ప్రజా వ్యతిరేక విధానాలను ప్రశ్నిస్తూ యువతలో చైతన్యం తీసుకొచ్చే విధంగా పనిచేయాలని వారికి చెప్పారు.. అనంతరం ఈ అవకాశం కల్పించినందుకు బోండా ఉమా గారికి, తెలుగుదేశం పార్టీకి ప్రయాగ కృష్ణ,బూదాల సురేష్ ప్రేత్యేక ధన్యవాదాలు తెలిపారు.

# పరిశుభ్రతకు యువత పాటుపడాలి

ఆదోని ఆగస్టు 17, ( విభారె)పరిసరాల పరిశుభ్రత కొరకు యువత ప్రత్యేక శ్రద్ధ వహించి, ముందుకు రావాలని వివేకానంద యూత్ ఆర్గనైజేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు నాగరాజు గౌడ్ అన్నారు. మంగళవారం నెహ్రూ యువ కేంద్ర సంఘటన్ సహకారంతో వివేకానంద యూత్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ఎన్ వై కేఎస్ వాలంటరీ లక్ష్మీకాంత్ అధ్యక్షతన స్వచ్ఛ్ భారత్ కార్యక్రమాన్ని స్థానిక అశ్వర్థ లక్ష్మీనారాయణ స్వామి దేవాలయంలో నిర్వహించారు. దేవాలయంలోని పరిసర ప్రాంతంలో అపరిశుభ్రంగా ఉన్న ప్రాంతాన్ని శుభ్రపరిచి శ్రమదానం చేశారు.ఈ సందర్భంగా నాగరాజు గౌడ్, ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రతను దైనందిన జీవితంలో భాగంగా చేసుకోవాలని అప్పుడే స్వచ్ఛమైన వాతావరణం ఏర్పడుతుందన్నారు.పరిసరాల పరిశుభ్రత చేసేందుకు యువత తమకున్న సమయంలో వారానికి ఒకసారి గంట సమయం కేటాయించి తమ ప్రాంతాల్లోని దేవాలయాలు, విద్యాలయాలు మరియు ఇతర ప్రాంతాల శుభ్రతకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. పరిసర ప్రాంతాలను శుభ్రం చేసేందుకు ముందుకు వచ్చే యువతకు తమ సంస్థ ద్వారా పూర్తి సహకారం అందిస్తామన్నారు.ఈ కార్యక్రమంలోఎన్ వై కేఎస్ వాలంటరీ మేఘన,యూత్ ఆర్గనైజేషన్ సభ్యులు యశ్వంత్, రమేష్, దత్త రాజ్, సాయి, సిద్దు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు జగన్న విద్య కానుక కిట్లు పంపిణీ

వేలేరుపాడు, ఆగస్టు 17, ( విభారె) పశ్చిమగోదావరి జిల్లా వేలేరుపాడు మండల పరిధిలోని రుద్రంకోట గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల ఛైర్మన్ కొవ్వాల క్రాంతికుమార్ అధ్యక్షతన జగనన్న విద్యా కానుక కార్యక్రమం నిర్వహించారు. రుద్రంకోట గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులకు జగన్న విద్యా కానుక కిట్లను సొసైటీ ఛైర్మన్ గుద్దేటి భాస్కర్ అందజేశారు. ఈ సంధర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేద విద్యార్థులు ఎవ్వరు చదువుకోవడానికి ఇబ్బంది పడకుండా ఉండేందుకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం విద్యాభివద్ధికి ఎంతో కృషి చేస్తోందని, ప్రతి సంవత్సరం రెండు జతల బట్టలు,షూస్, పుస్తకాలు పంపిణి చేస్తున్నారు. అదేవిధంగా పిల్లలకు బళ్ళో పెట్టె మధ్యాహ్న భోజనంలో కూడా మార్పులు చేసి మంచి రుచికరమైన భోజనం పెడుతున్నారని, విద్యార్థులకు అమ్మ ఒడి రూపంలో సంవత్సరనికి పదిహేను వేల రూపాయలు అందజేస్తున్నారు. ఏ ప్రభుత్వ చేయని విధంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం విద్యార్థులకు అవసరమైన వస్తువులతో కూడిన కిట్లను పంపిణీ చేయడంతో పాటుగా చదువు కోవాలని ఉన్న చదివించే ఆర్థిక స్తోమత లేక చాలామంది చదువు మానేసి కూలీ పనులకు వెళ్తున్నరని, అటువంటి వాళ్ళు చదువు కునేందుకు వైసిపి ప్రభుత్వం విద్యాభివద్ధికి ఎంతో కృషి చేస్తోందని, ప్రవేట్ స్కూలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని వసతులు మౌలిక సదుపాయాలు కల్పించడంతో విద్య పట్ల వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి ఉన్న శ్రద్ధకు నిదర్శనమని, ప్రతి విద్యార్థీ విద్యా కానుకను సద్వినియోగం చేసుకోవాలని,సొసైటీ ఛైర్మన్ గుద్దేటి భాస్కర్ అన్నారు. ఈ కార్యక్రమంలో స్కూల్ ఛైర్మన్ కొవ్వాల క్రాంతికుమార్, హెచ్ యం శోభన్ బాబు,ఉపాద్యాయులు కిశోర్, సుమిత్ర,కమిటీ సభ్యులు, గ్రామస్థులు రహీం,జె.శివ,సత్యనారాయణ, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

# టీడీపీ నేత జ్యోతుల నెహ్రూకు గుండెపోటు


జగ్గంపేట: మాజీ ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జ్యోతుల నెహ్రూ సోమవారం అస్వస్థతకు గురయ్యారు. పొలంలో ఉండగా సాయంత్రం ఆయనకు గుండెపోటు వచ్చింది. జగ్గంపేట నుంచి వైద్యులు హుటాహుటిన చేరుకుని, ప్రథమ చికిత్స చేశారు. పరిస్థితి విషమంగా ఉండడంతో జగ్గంపేటలోని ప్రైవేటు ఆసుపత్రికి తీసుకువచ్చారు. నెహ్రూకు డాక్టర్ రమేష్ ఆక్సిజన్ అందించి ఉపశమనం కల్పించారు. అనంతరం రాజమహేంద్రవరం బొల్లినేని ఆసుపత్రికి తరలించారు. ఆయన అపాయం నుంచి బయటపడ్డారని టీడీపీ నేతలు తెలిపారు.

# గ్రామాల్లో కొలువైన పీర్ల దేవుళ్ళు

### భక్తిశ్రద్ధలతో ఇమామ్ ఖాసీం (గంటప్ప దేవుళ్ళు) సరగసు
### కులమతాలకు అతీతంగా అతిపెద్ద పండుగ మొహారం

కౌతాళంఆగస్టు 17, ( విభారె) కౌతాళం మండలంలో గ్రామ గ్రామంలో కొలువైన పీర్లదేవుళ్ళు కులమతాలకు అతీతంగా భక్తిశ్రద్ధలతో కొలిచే ఆరాధ్య దేవుళ్ళు పీర్లదేవుళ్ళు గ్రామ ప్రజలందరు 10 రోజులు భక్తిశ్రద్ధలతో పూజిస్తారు. ముస్లిం లు అత్యంత భక్తిశ్రద్ధలతో చేసుకునే పండుగ మొహారం ఒకటి పది రోజులు పాటు జరిపే ఈ పండుగ సందర్భంగా ఇస్లాం కు సంబంధించిన ప్రవచనములు మొహమ్మద్ ప్రవక్త బోధనలు వినిపిస్తాయి మొహారం నెల పదోరోజున పీర్లను ఊరేగింపు నిర్వహిస్తారు. ఈ సమయంలో పెద్ద ఎత్తున హజ్రత్ ఇమాం హుషేన్ ను గుర్తుగ పంజా ( ప్రతిమ) లను ఉరేగించి తమసంతాపం ప్రకటిస్తారు. ఇస్లాం క్యాలెండర్ ప్రకారం తొలి మాసాన్ని మొహారం నెలగా భావిస్తారు. మొహారం పండుగ పదో రోజున ప్రత్యేకత ఉంది 10,11 వ రోజుల్లో ఉపవాస దీక్షలు పాటించడాన్ని ముస్లింలు పవిత్రంగా భావిస్తారు. మొహారం నెలలో ముస్లింలు ఎలాంటి శుభకార్యాలు నిర్వహించారు. తమ ప్రాణాలను సైతం త్యాగం చేసిన హజ్రత్ ఇమామ్ హుషేన్ కు సంతాపం తెలిపే ఉద్దేశ్యం తో ముస్లింలు పాటిస్తారు.మానవ హక్కులకోసంజరిగిన చరితాత్మక పోరాటం మొహారం ఈ పేరు వినగానే పిర్లు, నిప్పుల గుండాలు గుండెలు బాదుకుంటు మతం చడవటాలు గుర్తుకువస్తాయి.మంగళవారం ఇమామ్ ఖాసీం సరగసు భక్తిశ్రద్ధలతో గ్రామ ప్రజలు జరుపుకున్నారు. ఉదయం పీర్లదేవుళ్ళు ఊరేగింపుగ వెళ్లారు.ఊరేగింపు లోప్రజాలు నైవేద్యాలు సమర్పించారు.

# డేనీ వర్సెస్ భీమ్లా



'భీమ్లా... భీమ్లా నాయక్' అని ఒకరు. 'డేని... డేనియల్ శంకర్' అంటూ మరొకరు. ఇద్దరూ శక్తిమంతమైన వ్యక్తులే. మరి వీరిద్దరి మధ్య గొడవేమిటో... అది ఎక్కడివరకు దారి తీసిందో తెలియాలంటే మాత్రం 'భీమ్లా నాయక్' విడుదల వరకు ఆగాల్సిందే. పవన్కల్యాణ్, రానా కథానాయకులుగా నటిస్తున్న చిత్రమిది. నిత్యమేనన్, ఐశ్వర్య రాజేశ్ కథానాయికలు. సాగర్ కె.చంద్ర దర్శకత్వం వహిస్తున్నారు. సూర్యదేవర నాగవంశీ నిర్మిస్తున్నారు. త్రివిక్రమ్ స్క్రీన్ప్లే, సంభాషణలు సమకూర్చారు. మలయాళంలో విజయవంతమైన 'అయ్యప్పనుమ్ కోశియుమ్'కి రీమేక్గా రూపొందుతున్న చిత్రమిది. స్వాతంత్ర్య దినోత్సవసందర్భంగా ఆదివారం ప్రముఖ దర్శకుడు హరీష్ శంకర్ ఈ సినిమా పేరుని అధికారికంగా ప్రకటించడంతోపాటు ప్రచార చిత్రాన్నివిడుదలచేశారు.కొన్నాళ్లుగాచిత్ర పరిశ్రమలో వినిపిస్తున్నట్టు గానే సినిమాకి 'భీమ్లా నాయక్' అనే పేరుని ఖరారు చేశారు. సినిమాలో పవన్కల్యాణ్ పాత్ర పేరే అది. ఆయన పోలీస్ అధికారిగా సందడి చేయనున్నారు. రానా దగ్గుబాటి...డేనియల్ శంకర్గా నటిస్తున్నారు. జనవరి 12న ప్రేక్షకుల ముందుకు రానున్న ఈ చిత్రంలోరావు రమేష్, మురళీశర్మ, సముద్రఖని, రఘుబాబు, చిట్టి, పమ్మిసాయి తదితరులు నటిస్తున్నారు. సంగీతం: తమన్.ఎస్, ఛాయాగ్రహణం: రవి కె.చంద్రన్, కూర్పు: నవీన్ నూలి, కళ: ఎ.ఎస్.ప్రకాశ్, సమర్పణ: పి.డి.వి.ప్రసాద్.

## పుష్పకు తప్పని లీకుల బెడద..!

అల్లు అర్జున్ హీరోగా సుకుమార్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రం పుష్ప. రెండు పార్టులుగా తెరకెక్కుతున్న ఈ చిత్రం తొలి పార్టు క్రిస్మస్ కానుకగా విడుదల కానుండగా ఇటీవల విడుదల చేసిన ఫస్ట్ సాంగ్కు మంచి రెస్పాన్స్ వచ్చింది. ఊరమాస్ సాంగ్తో ఫ్యాన్స్కు కిక్కించారు అర్జున్.అయితే ఇప్పటివరకు బాగానే ఉన్నా తాజాగా పుష్ప సినిమాకు సంబంధించిన ఫైట్ సీన్ లీకవడం మేకర్స్ని కలవర పెడుతోంది. 20 సెకన్ల వీడియో లీక్ కాగా, ఇందులో అల్లు అర్జున్, రష్మిక కనిపిస్తున్నారు. బన్నీ మెటల్ చైర్తో గూండాని కొడుతున్నట్టుగా ఉందట. దీంతో పోలీసులను ఆశ్రయించారు మైత్రీ మూవీ మేకర్స్.మా చిత్రాలకు సంబంధించిన కంటెంట్ ఆన్ లైన్ లో లీక్ కావడం మమ్మల్ని తీవ్రంగా కలచివేసింది. దీన్ని మేము తీవ్రంగా ఖండిస్తున్నాం. దీనిపై ఇప్పటికే ఫిర్యాదు చేశాం అని తెలిపింది. ఈ తరహా ధోరణితో తమను ఇబ్బందులకు గురిచేయడమే కాకుండా, ప్రేక్షకులకు అందాల్సిన థ్రిల్ ను చంపేస్తున్నారని వివరించింది.



# అప్పుడే సినిమాలకు గుడ్బై చెప్పాలనుకున్నా: స్టార్ హీరోయిన్



హీరోయిన్ శృతి హాసన్ ప్రస్తుతం 'సలార్' మూవీ షూటింగ్తో బిజీగా ఉంది. ఈ నేపథ్యంలో ఆమెకు సంబంధించి ఓ ఆసక్తిర విషయం బయటకు వచ్చింది. శృతి నటిగా కంటే ముందు ఇండస్ట్రీకి గాయనీగా పరిచయమైన సంగతి తెలిసిందే. తన తండ్రి, విలక్షణ నటుటు కమల్ హాసన్ 'ఈనాడు' సినిమాలో ఆమె ఓ పాట పాడింది. ఆ తర్వాత కమల్ దర్శకత్వంలో వచ్చిన 'హేరామ్' మూవీలో అతిథిగా పాత్రలో కనిపించి నటిగా ఎంట్రీ ఇచ్చింది. అలా నటిగా తన జర్నీని స్టార్ట్ చేసిన శృతికి సంగీతం అంటే ప్రాణమని ఇటీవల ఓ ఇంటర్వ్యూలో చెప్పుకొచ్చింది. మ్యూజిక్ మీద ఆసక్తితోనే తను సినిమాల్లోకి వచ్చానంటూ ఆసక్తికర వ్యాఖ్యలు చేసింది.ఈ సంద్భంగా ఆమె మాట్లాడుతూ.. మ్యూజిక్ అంటే ఇష్టం ఉన్న శృతి హీరోయిన్గా ఎలా మారిందో వివరించింది. 'కాలేజీలో ఉన్నప్పుడు రాక్స్టార్ అవ్వాలని కలలు కనేదాన్ని. ఎలాగైన సొంతంగా ఒక రాక్బ్యాండ్ నడపాలి అనుకున్న. అయితే బ్యాండ్ నడపాలంటే డబ్బు కావాలి. అప్పడు నా దగ్గర అంత డబ్బు లేదు. అందుకే రెండు, మూడు సినిమాలు చేసి ఆ డబ్బుతో బ్యాండ్ స్టార్ట్ చేసి సినిమాలకు గుడ్బై చెప్పాలనుకున్న. కానీ ఇక్కడకు వచ్చాక నాకు తెలియకుండానే నటనను ఇష్టపడ్డాను. మెల్లిగా సినిమాతో ప్రేమలో పడ్డాను. ఇప్పుడు ఇండస్ట్రీయే నా ప్రపంచం అయ్యింది' అంటూ చెప్పుకొచ్చింది.అయితే తను సినిమాల్లో ఎంత బిజీగా ఉన్న సంగీతాన్ని మాత్రం వదిలి పెట్టలేదని, విరామం దొరికినప్పుడు తన సమయం మ్యూజిక్కు కేటాయిస్తానని ఆమె పేర్కొంది. కాగా ప్రస్తుతం శృతి తన బాయ్ఫ్రెండ్ శాంతానుతో కలిసి మ్యూజిక్ మొదలు పెట్టె ప్లాన్లో ఉన్నట్లు తెలిపింది. అయితే మీ తండ్రి పెద్ద స్టార్ కదా ఆయన దగ్గర డబ్బు ఎందుకు తీసుకోలేదని అడగ్గా.. తనకు సొంతగా ఎదగడం ఇష్టమని, అది తన కల, తాను సొంతంగా సంపాదించిన డబ్బుతోనే కలను నిజం చేసుకోవాలనుకున్నానని శృతి తెలిపింది.

# కోహ్లి సంబరాలు మాములుగా లేవు.. వీడియో వైరల్

లార్డ్స్: ఇంగ్లండ్తో జరిగిన రెండో టెస్టులో టీమిండియా 151 పరుగుల తేడాతో చారిత్రక విజయాన్ని అందుకుంది. ఈ నేపథ్యంలో టీమిండియా కెప్టెన్ విరాట్ కోహ్లి సంబరాలు.. అతను చేసిన హంగామా ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్గా మారాయి. కోపం వచ్చినా.. సంతోషం కలిగినా కోహ్లిని ఆపడం ఎవరి వల్ల కాదని మరోసారి నిరూపించాడు. మ్యాచ్ గెలిచిన అనంతరం మైదానంలో భారత ఆటగాళ్లు సెలబ్రేషన్స్లో మునిగిపోయారు. కానీ తనదైన శైలిలో గట్టిగా అరుస్తూ తోటి ఆటగాళ్లను హగ్ చేసుకుంటూ కోహ్లి చేసిన హంగామాతో అందరి దృష్టి అతనిపైకే మళ్లింది.ఇక కోహ్లి రోహిత్ను హగ్ చేసుకోవడం హైలెట్గా నిలిచింది. ఈ ఇద్దరి మధ్య బేదాభిప్రాయాలు ఉన్నాయంటూ గతంలో పలుమార్లు వార్తలు వచ్చిన సంగతి తెలిసిందే. అయితే తాజా వీడియోతో మా మధ్య అలాంటివేం లేవని కోహ్లి చెప్పకనే చెప్పాడు. అంతకముందు ఆట నాలుగో రోజు ముగిసిన తర్వాత లార్డ్స్ బాల్కనీలో కోహ్లి నాగిన్ డ్యాన్స్తో అలరించాడు. అతని నాగిన్ డ్యాన్స్ను చూసిన కేఎల్ రాహుల్, మయాంక్ అగర్వాల్, మహ్మద్ సిరాజ్లు ఈలలు, గోలతో రెచ్చిపోయారు. దీనికి సంబంధించిన వీడియో కూడా వైరల్ అయింది.ఇక రెండో టెస్టులో ఒక దశలో భారత్ మ్యాచ్ ఓడిపోతుందనే సందేహాలు కలిగాయి. అయితే రెండో ఇన్నింగ్స్లో భారత టెయిలెండర్లు మహ్మద్ షమీ, జస్ప్రీత్ బుమ్రా, ఇషాంత్ శర్మలు అద్భుత బ్యాటింగ్తో ఇంగ్లండ్ ముందు మంచి లక్ష్యాన్నే నిర్ధేశించారు. ఇంగ్లండ్ టార్గెట్ 272. రెండు సెషన్లు, 60 ఓవర్లు. ఓపెనింగ్ సహా టాపార్డర్ నిలబడితే, దీనికి వేగం జతయితే ఓవర్కు 4 పరుగులు




చేయడం ఏమంత కష్టం కాదు. కానీ బుమ్రా, షమీ వారికి ఆ అవకాశమే ఇవ్వలేదు.ఇద్దరు ప్రారంభ ఓవర్లలోనే బర్న్స్ (0), సిబ్లీ (0)లను ఖాతా తెరువనీయలేదు. వీళ్లిద్దరికి తోడుగా ఇషాంత్ దెబ్బ మీద దెబ్బ తీశాడు. హమీద్ (9), బెయిర్ స్టో (2)ల పనిపట్టాడు. కెప్టెన్ రూట్ (60 బంతుల్లో 33; 5 ఫోర్లు) జట్టును కాపాడాలనుకున్నా బుమ్రా ఆ అవకాశం అతనికి ఇవ్వలేదు. ఈ స్థితిలో డ్రా చేసుకోవడం కూడా ఇంగ్లండ్కు కష్టమే! అయినా సరే బట్లర్ (96 బంతుల్లో 25; 3 ఫోర్లు) ప్రయత్నిద్దామనుకున్నాడు. కానీ సీన్లోకి ఈ సారి సిరాజ్ వచ్చాడు.

EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY **AVULA VIJAYA BHASKARA REDDY** PRINTED AT **SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH.**
**PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190**